## విలేఖరులు కావలెను

ఆంధ్రప్రదేశ్ మరియు తెలంగాణ రాష్ట్రాల వ్యాప్తంగా " శ్రీ ప్రస్థానం దినపత్రికలో " పనిచేయుటకు జిల్లా స్టాఫర్లు, సిసి ఇంచార్జులు, మండల స్థాయి పాత్రికేయులు కావలెను. సమాజంలో జరిగే ప్రతి విషయాన్ని ప్రజల ముంగిటకు తీసుకెళ్లాలనే ఆసక్తి, అనుభవం ఉన్నవారికి ప్రధాన్యత ఉంటుంది.

**పెరుమాళ్ళ వర ప్రసాద్**

సంప్రదించవలసిన నంబర్లు

**94916 28386 85220 22029**

**Land Line No : 08517 224194**



RNI Rgd NO : 2020/80757

www.sreeprasthanam.in

# శ్రీ ప్రస్థానం

మన దేశం..మన హక్కు

తెలుగు దినపత్రిక



తెలంగాణ - శ్రీ ప్రస్థానం

Call : 8522022029, 9491628386



కర్నూలు సంపుటి : 04 సంచిక : 26 శుక్రవారం 10-05-2024 పేజీలు :04 వెల:రూ.2.00


## కేసీఆర్‌తో బీజేపీ ఆటలు సాగలేదు.. సాగవు కూడా : కేటీఆర్



హైదరాబాద్ : తెలంగాణలో కేసీఆర్‌తో బీజేపీ ఆటలు సాగలేదు.. సాగవు కూడా అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ స్పష్టం చేశారు. ప్రాంతీయ శక్తులు బలంగా ఉండడం వల్ల ఢిల్లీ, పశ్చిమ బెంగాల్, తమిళనాడు, జార్ఖండ్ లాంటి రాష్ట్రాల్లో మోదీ ఆటలు సాగలేదని కేటీఆర్ పేర్కొన్నారు. మల్కాజ్‌గిరి పార్లమెంట్ నియోజకవర్గంలో ఏర్పాటు చేసిన యూత్ మీటింగ్‌లో కేటీఆర్ పాల్గొని రాగిడి లక్ష్మారెడ్డికి మద్దతుగా మాట్లాడారు. ఎస్సీ, ఎస్టీ , బీసీ, మైనార్టీ, అగ్రవర్ణాల్లో ఉండే పేదల రిజర్వేషన్లు రద్దు చేయాలనే ఆలోచనలో బీజేపీ ప్రభుత్వం ఉంది. అవసరమైతే రాజ్యాంగాన్ని తీసిపాడేయాలని ఆలోచిస్తున్నారు. రిజర్వేషన్లు ఉండాలంటే బీఆర్ఎస్ గెలవాలి. ఆయా రాష్ట్రాల్లో కాంగ్రెస్ ప్రభుత్వాలను బీజేపీ పడగొట్టి.. అధికారం చేజిక్కించుకుంది. కేసీఆర్ ప్రభుత్వాన్ని పడగొట్టే ప్రయత్నం చేశారు. బెంగాల్‌లో మమతా బెనర్జీ ప్రభుత్వాన్ని, జార్ఖండ్‌లో, తమిళనాడులో, ఢిల్లీలో కూడా ప్రభుత్వాలను పడగొట్టాలని ప్రయత్నం చేశారు. కేసీఆర్, కేజ్రీవాల్, మమత, హేమంత్ సోరెన్, స్టాలిన్ లాంటి నాయకుల వద్ద బీజేపీ ఆటలు సాగలేదు. ప్రాంతీయ శక్తులు బలంగా ఉండడం వల్లే మోదీ ఏం చేయలేకపోయారు. మోదీతో కొట్లాడే దమ్ము రాహుల్ గాంధీకి లేదు అని కేటీఆర్ స్పష్టం చేశారు. ఈ పదేండ్ల కాలంలో ప్రధాని నరేంద్ర మోదీ హైదరాబాద్‌కు ఒక్క పని కూడా చేయలేదు. దవాఖానా, గుడి కట్టలేదు. పరిశ్రమలు కూడా తేలేదు. ఓటు ఎందుకు వేయాలంటే రామ మందిరం కట్టామని చెబుతున్నారు. మతం పేరు మీద రాజకీయాలు చేస్తున్నారు. రాముడు రాజధర్మం పాటించమని చెప్పారు. హిందువైనా, ముస్లిం అయినా ఒకటే తీరుగా చూడాలి. అదే విధంగా తెలంగాణ గుజరాత్‌ను కూడా ఒకటే తీరుగా చూడాలి. హైదరాబాద్‌కు వరద వస్తే ఒక్క రూపాయి కూడా సాయం చేయలేదు. అదే గుజరాత్‌కు వరద వస్తే వెయ్యి కోట్లు సాయం చేసిండు. వాట్సాప్‌లో రామమందిరం, అయోధ్య ఫొటోలు రాగానే ఆగం కావొద్దు. కేసీఆర్ యాదాద్రి కట్టలేదా..? మరి కేసీఆర్ యాదాద్రిని అడ్డం పెట్టుకుని రాజకీయాలు చేయలేదు కదా..? ఒక్క హామీ కూడా నిలబెట్టుకోలేని మోదీకి ఎందుకు ఓటేయాలి..? కాళేశ్వరం, పాలమూరు ప్రాజెక్టుకు జాతీయ హోదా ఇవ్వలేదు. మరి ఈటల రాజేందర్‌కు ఎందుకు ఓటేయాలి..? అని కేటీఆర్ నిలదీశారు.

# నాలుగో విడత ఎన్నికలకు సమీపిస్తున్న గడువు



13న దేశవ్యాప్తంగా నాలుగో విడత ఎన్నికలు
11న సాయంత్రం ముగియనున్న ప్రచారం
ప్రశాంతంగా ఎన్నికల నిర్వహణకు ఇసి ఏర్పాట్లు
ఎపిలో సున్నిత ప్రాంతాల్లో ప్రత్యేక ఫోకస్




న్యూఢిల్లీ,మే9: దేశవ్యాప్తంగా నాలుగో దశ సార్వత్రిక ఎన్నికలకు గడువు దగ్గర పడింది. మే13న నాలుగో విడత ఎన్నికలు జరుగగనున్నాయి. ఇందులో ఉబయ తెలుగు రాష్ట్రాలు కూడా ఉన్నాయి. ఎపిలో పార్లమెంటుతో పాటు అసెంబ్లీకి కూడా ఎన్నికలు జరుగబోతున్నాయి. ఇందుకోసం పార్టీలు హోరాహోరీగా ప్రచారం నిర్వహిస్తున్నాయి. శనివారం 11వ తేదీ సాయంత్రంతో ప్రచారం ముగియనుంది. ఈ క్రమంలో ఎన్నికలకు 48 గంటల ముందు అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని కేంద్ర ఎన్నికల సంఘం సూచించింది. ఏపీలో పలు జిల్లాల్లో సున్నితమైన ప్రాంతాలు ఉన్నాయని.. అలాంటి చోట కట్టుదిట్టమైన భద్రత ఏర్పాటు చేయాలని సీఈసీ ఆదేశాలు జారీ చేసింది. పోలింగ్ కేంద్రానికి వచ్చే ఓటర్లకు ఎండదెబ్బ తగలకుండా అవసరమైన ఏర్పాట్లు చేయాలని సీఈసీ రాజీవకుమార్ సూచించారు. ఈనెల 13 న నాలుగవ దశలో ఎన్నికల జరిగే రాష్ట్రాల అధికారులతో కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజకుమార్ వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. 14 రాష్ట్రాలు, 2 కేంద్ర పాలిత ప్రాంతాల్లో ఈ నెల 13న ఎన్నికలు జరుగనున్నాయి. ఎన్నికల ఏర్పాట్లపై కేంద్ర పరిశీలకులు, ప్రత్యేక పరిశీలకులు, ప్రధాన ఎన్నికల అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులకు రాజీవ్ కుమార్ పలు సూచనలు చేశారు. ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో పారదర్శకంగా నిర్వహించేందుకు చేస్తున్న ఏర్పాట్లను ఆయన సమీక్షించారు. నాల్గవ దశలో ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, తదితర 14 రాష్ట్రాలతో పాటు పలు కేంద్ర పాలిత ప్రాంతాలకు ఈనెల 13 న ఎన్నికలు జరుగనున్నట్లు తెలిపారు. అయితే వీటన్నింటిలో ప్రత్యేకించి ఆంధ్రప్రదేశ్, తెలంగాణా రాష్ట్రాలను ఎంతో సున్నితమైనవిగా ఎన్నికల సంఘం గుర్తించిందన్నారు. ఈ రాష్ట్రాల్లో ఎన్నికల నిర్వహణ విషయంలో ఎన్నికల యంత్రాంగం అంతా ఎంతో అప్రమత్తంగా ఉండాలన్నారు. మే 13న ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో ఎన్నికల నిర్వహణకు ముందు 48 గంటలు ఎంతో కీలకమైనవన్నారు. 24 గంటలు ఎంతో అప్రమత్తంగా ఉండాలని.. హింసకు ఏ మాత్రం అవకాశం లేకుండా శాంతి భద్రతలను పరిరక్షించాలని సూచించారు. ప్రత్యేకించి నక్సల్స్ ప్రభావిత ప్రాంతాల్లో కేంద్ర బలగాలతో పటిష్టమైన భద్రతా ఏర్పాట్లు చేయాలన్నారు. ఓటర్లను ప్రభావితంచేసే నగదు, ఇతర ఉచితాల పంపిణీపై గట్టి నిఘా ఉంచాలన్నారు. ప్రత్యేకించి సాధారణ, పోలీస్, వ్యయ పరిశీలకులు ఎంతో అప్రమత్తంగా ఉండాలని, ఎటు వంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా చూడాలన్నారు. నాలుగో దశ ఎన్నికలు జరుగుతున్న రాష్ట్రాల్లో ఆంధ్రప్రదేశ్ అత్యంత సునిశితమైన రాష్ట్రంగా ఎన్నికల సంఘం ప్రకటించింది. ప్రత్యేకించి కొన్ని జిల్లాలు సమస్యాత్మకంమైనవిగా గుర్తించడమైందని, ముఖ్యంగా ప్రత్యేక పరిశీలకులు ఆయా జిల్లాలో తరచుగా పర్యటిస్తూ ఎటువంటి అవాంచనీయ సంఘటనలకు అవకాశం లేకుండా చూడాలన్నారు. ఆయా జిల్లాలు, నియోజక వర్గాలకు సంబంధించిన తాజా సమాచారాన్ని ఎప్పటి కప్పుడు తమకు నేరుగా తెలియపర్చాలని కేంద్ర ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన వెంటనే ఆంధ్రప్రదేశ్‌లో

పలు జిల్లాల్లో హింసాత్మక ఘటనలు చోటు చేసుకోవడంతో తిరిగి అలాంటి ఘటనలు పునరావృతం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ప్రస్తుతం ఎండలు, వడగాల్పులు ఎక్కువగా ఉన్న నేపథ్యంలో ఓటర్లు ఏమాత్రము ఎండ బారిన పడకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. క్యూలైన్లు అన్ని షామియానాలతో కవర్ అయ్యేలా చూడాలని, ఓటర్లు కూర్చునేందుకు క్యూలైన్లలో బెంచ్?లను ఏర్పాటు చేయాలని, ప్రత్యేకించి త్రాగునీరు, ఓ.ఆర్.ఎస్, ప్రథమ చికిత్స సేవలను అందుబాటులో ఉంచాలని ఆదేశించారు. ఓటు వేయడం సామాజిక బాధ్యత అనే విషయాన్ని ఎస్.ఎం.ఎస్., షోషల్ మీడియా ద్వారా ఓటర్లను చైతన్య పరుస్తూ ఓటింగ్ శాతాన్ని పెద్ద ఎత్తున పెంచాలని ఆదేశించారు.

## రూ. లక్ష డిపాజిట్ చేస్తాం: రాహుల్ గాంధీ

ఈ దేశంలో రాజ్యాంగంతోనే పేదలకు బలమైన శక్తి వచ్చిందని కాంగ్రెస్ అగ్రనేత రాహుల్గాంధీ అన్నారు.



నర్సాపూర్: ఈ దేశంలో రాజ్యాంగంతోనే పేదలకుబలమైన శక్తి వచ్చిందని కాంగ్రెస్ అగ్రనేతరాహుల్గాంధీ అన్నారు. ఎన్నికల ప్రచారంలోభాగంగా మెదక్ జిల్లా నర్సాపూర్లో నిర్వహించినకాంగ్రెస్ జనజాతర సభలో ఆయన ప్రసంగించారు."గొప్ప మేధావులు ఏళ్ల తరబడి కృషి చేసి దేశానికిరాజ్యాంగం అందించారు. ఎంతో గొప్పదైన మనరాజ్యాంగాన్ని మారుస్తామని భాజపా నేతలుచెబుతున్నారు. దేశంలో 90శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ,బీసీలకు రాజ్యాధికారం దక్కటం లేదు. విద్య,ఉద్యోగాలు, ఓటు హక్కు అన్నీ మనకు రాజ్యాంగంద్వారానే వచ్చాయి. దాంతో పాటు రిజర్వేషన్లుకూడా రద్దు చేయాలని భాజపా, ఆర్ఎస్ఎస్ కుట్రచేస్తున్నాయి. రిజర్వేషన్లు రద్దు చేసే కుట్రలో భాగంగానే ప్రభుత్వ రంగ సంస్థలను విక్రయిస్తున్నారు. క్రమంగా అన్నింటినీ ప్రైవేటు పరం చేసి రిజర్వేషన్లు రద్దు చేయాలనేది భాజపా ఆలోచన. మోదీ పదేళ్లలో విమానాశ్రయాలు, పోర్టులు, భారీ పరిశ్రమలు విక్రయించారు. భాజపా కుట్రలను అడ్డుకునేందుకు ఇండియా కూటమి శాయశక్తులా పోరాడుతోంది. మోదీ పాలనలో కేవలం 2శాతం ఉన్న బిలియనీర్ల చేతిలోకి దేశ సంపద అంతా వెళ్తుంది. బలహీన వర్గాల్లో రాజకీయ చైతన్యం తెచ్చేందుకు మేం కృషి చేస్తున్నాం. దేశంలో పేదరికాన్ని సమూలంగా నిర్మూలించేందుకు గొప్ప పథకాన్ని రూపొందించాం. ఇండియా కూటమి అధికారంలోకి వచ్చాక..నిరుపేదలందరితో ఒక జాబితా రూపొందిస్తాం. ప్రతి కుటుంబం నుంచి ఒక మహిళ పేరును ఎంపిక చేసుకుని వారి బ్యాంకు ఖాతాలో రూ. లక్ష డిపాజిట్ చేస్తాం. విద్య, వైద్యం తదితర కుటుంబ ఖర్చుల కోసం వారికి ప్రతి నెలా రూ. 8,500 వారి ఖాతాలో జమ అవుతాయి" అని రాహుల్ గాంధీ తెలిపారఇందిరాగాంధీ హయాంలోనే మెదక్ అభివృద్ధి.. ముఖ్యమంత్రి రేవంత్రెడ్డి మాట్లాడుతూ.. మెదక్ ఎంపీ అభ్యర్థి నీలం మధును గెలిపించాలని కోరారు.

# కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వొద్దు: సుప్రీంలో ఇడి అఫిడవిట్

న్యూఢిల్లీ: ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ ఇవ్వరాదని ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్(ఇడి) గురవారం స్పష్టం చేసింది. ఎన్నికల ప్రచారంలో పాల్గొనడం ప్రాథమిక హక్కు కాదని ఇడి తెలిపింది. ఢిల్లీ లిక్కర్ పాలసీ కేసులో మధ్యంతర బెయిల్ కోసం అరవింద్ కేజ్రీవాల్ దాఖలు చేసిన పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ సందర్భంగా గురువారం ఇడి తరఫున ఆ సంస్థ డిప్యూటీ డైరెక్టర్



భాను ప్రియ అఫిడవిట్ దాఖలు చేశారు. ఎన్నికల్లో ప్రచారం చేసే హక్కు ప్రాథమిక, రాజ్యాంగపరమైన, చట్టపరమైన హక్కేమీ కాదని ఇడి తన అఫిడవిట్‌లో పేర్కొంది. ఎన్నికల్లో పోటీ చేసే అభ్యర్థి కానప్పటికీ తమకు తెలిసి దేశంలో ఏ రాజకీయ నాయకుడికి ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ ఇవ్వలేదని ఇడి తెలిపింది.ఆప్ అధినేత మధ్యంతర బెయిల్ కోరడంపై ఇడి మండిపడుతూ గతంలో కూడా సమన్లను తప్పించుకోవడానికి కేజ్రీవాల్ ఐదు రాష్ట్రాలలో ఎన్నికలు ఉన్నాయంటూ ఇదే సాకు చూపారని తెలిపింది. ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ మజూరు చేస్తే ఏ రాజకీయ నాయకుడిని అరెస్టు చేసి జుడిషియల్ కస్టడీకి పంపడం సాధ్యం కాదని ఇడి వాదించింది. గడచిన మూడేళ్లలో దాదాపు 23 ఎన్నికలు జరిగాయని, ఏడాది పొడవునా ఎన్నికలు జరుగుతూనే ఉంటాయని, ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ ఇస్తే ఇక ఏ రాజకీయ నాయకుడిని అరెస్టు చేసి జుడిషియల్ కస్టడీకి తరలించలేమని ఇడి తన అఫిడవిట్‌లో పేర్కొంది. సార్వత్రిక ఎన్నికల ప్రచారం కోసం కేజ్రీవాల్‌కు మధ్యంతర బెయిల్ మంజూరు చేయడం వల్ల చట్టానికి, సమానత్వానికి విరుద్ధమవుతుందని ఇడి వాదించింది.చిత్తశుద్ధి లేని నాయకులంతా నేరాలు చేయడానికి అనుమతించి ఎన్నికల ముసుగులో దర్యాప్తును తప్పించుకోవడానికి అవకాశం ఇచ్చినట్లవుతుందని ఇడి పేర్కొంది. సామాన్య పౌరుడికి మించి తమకు ప్రత్యేక హోదా ఉందని అరవింద్ కేజ్రీవాల్ కాని మరే రాజకీయ నాయకుడు కాని చెప్పుకునే అవకాశం లేదని ఇడి వాదించింది. దీని వల్ల దేశంలో రెండు రకాల తరగతులు ఏర్పడతాయ. ఒకరు సామాన్య పౌరులైతే మరొకరు రాజకీయ నాయకులని, సామాన్య పౌరులు చట్టానికి లోబడి ఉంటే ఎన్నికల ప్రచారం కోసం మధ్యంతర బెయిల్ పొందవచ్చన్న నమ్మకంతో చట్టాల నుంచి మినహాయింపును కోరే రాజకీయ నాయకులు మరొకరని ఇడి పేర్కొంది. జుడిషియల్ కస్టడీలో ఉండి ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందిన రాజకీయ నాయకులు ఉన్నారని, కాని వారికి ఎన్నడూ మధ్యంతర బెయిల్ ఇవ్వలేదని కూడా ఇది వాదించింది. పిఎంఎల్ఎ నేరాలు కాని కేసులలో కూడా దేశవ్యాప్తంగా రాజకీయ నాయకులు జుడిషియల్ కస్టడీలో ఉండవచ్చని ఇడి తెలిపింది.

## కాంగ్రెస్ హామీలు అమలు కాలేదు..కానీ మోదీ చెప్పింది చేస్తారు

హైదరాబాద్,మే9: 2024 ఎన్నికలు రాహుల్ గాంధీకి, ప్రధాని మోదీకి మధ్య జరుగుతున్న ఎన్నికలని కేంద్ర హోం మంత్రి అమిత్ షా వ్యాఖ్యానించారు. హోంమంత్రి యాదాద్రి భువనగిరిలోని బహిరంగ సభలో ప్రసంగించిన క్రమంలో ఈ మేరకు పేర్కొన్నారు. అంతేకాదు ఇవి కుటుంబ అభివృద్ధి, దేశ అభివృద్ధికి మధ్య జరుగుతున్న ఎన్నికలని అన్నారు. తెలంగాణలో బీజేపీ 2019 ఎన్నికల్లో నాలుగు సీట్లు గెలిచింది. కానీ ఈసారి 10 సీట్లు గెలవబోతున్నామని తెలిపారు. మూడు విడతల్లో ఇప్పటికే 200 సీట్లు గెలిచామని, మిగిలిన దశల్లో మొత్తం 400 సీట్లు గెలుస్తామని ధీమా వ్యక్తం చేశారు.కాంగ్రెస్ ముస్లింలకు 4% రిజర్వేషన్ ఇవ్వడంతో షెడ్యూల్ కులాలు, తెగల వారు ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు అమిత్ షా చెప్పారు. ఈ నేపథ్యంలో బీజేపీకి రాష్ట్రంలో పది సీట్లు ఇస్తే ముస్లింల రిజర్వేషన్ తొలగించి ఎస్సీ, ఎస్టీ, ఓబీసీలకు ఇస్తామని అన్నారు. అంతేకాదు రాష్ట్రంలో రాహుల్ బాబా ఇచ్చిన రుణమాఫీ హామీ ఇప్పటివరకు అమలు కాలేదని అన్నారు. కాంగ్రెస్ వాగ్దానాలు ఎప్పటికీ అమలు చేయదని, కానీ ప్రధాని మోదీ చెప్పింది తప్పక అమలు చేస్తారని హో మంత్రి పేర్కొన్నారు.అంతేకాదు ఇప్పటికే వాగ్దానం చేసినట్లుగానే ప్రధాని మోదీ రామ మందిర నిర్మాణం చేయించి చూపించారని అమిత్ షా గుర్తు చేశారు. ఖర్గే చెప్పినట్టుగా రాజస్థాన్, తెలంగాణ ప్రజలకు కశ్మీర్‌కు ఏమి సంబంధమని ఎద్దేవా చేశారు. ఆర్టికల్ 370ని తొలగించి కశ్మీర్‌లో త్రివర్ణ పతాకం ఎగరేలా చేశామని షా అన్నారు. మోదీ ఉగ్రవాదం, తీవ్రవాదం వంటి వాటిని రూపుమాపి మావోయిస్టు సిద్ధాంతాలు లేకుండా చేస్తున్నారని హోమంత్రి పేర్కొన్నారు.అసలు తెలంగాణలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ఓవైసీని నిలువరించగలవా అని షా ప్రశ్నించారు. ఈ క్రమంలో ఏబీసీ అనే పదాలకు కొత్త అర్థాలు చెప్పారు.

## పదేళ్లపాటు దోచుకున్న బిఆర్ఎస్

ఆరుగ్యారెంటీలతో మోసం చేసిన కాంగ్రెస్
ప్రచారంలో బిజెపి నేత కిషన్ రెడ్డి విమర్శలు



హైదరాబాద్,మే9: రాష్ట్రంలో పదేళ్లు బీఆర్ఎస్ దోచుకుంటే.. ఆరు గ్యారెంటీల పేరుతో కాంగ్రెస్ మోసం చేసిందని కేంద్ర మంత్రి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు ఓటు వేసినా వృథానేనని అన్నారు. ఎందుకంటే కేంద్రంలో మళ్లీ వచ్చేది మోదీ ప్రభుత్వమే అని ఆయన పేర్కొన్నారు. దేశాన్ని సమర్థంగా ముందుకు తసీఉకుని వెళ్లగల సమర్థ నాయకుడు మోడీ అన్నారు. సికింద్రాబాద్ ఎంపీగా తనను ఆశీర్వదించాలని, మోదీని మరోసారి ప్రధానిగా గెలిపించాలని ఆయన కోరారు. గురువారం నాంపల్లి నియోజకవర్గంలో ఆయన ప్రచారం నిర్వహించారు. జైన్‌మందిర్ తాళ్లగడ్డ వద్ద ప్రారంభమైన ప్రచార యాత్ర శారదనగర్, నవోదయకాలనీ, హుడాకాలనీ, శ్రీరామ్‌నగర్, రేతిబౌలి, మిలాన్ టాకీస్, కుమ్మరవాడి మీదుగా ఇందిరానగర్, బోయగూడ కమాన్, బజార్‌ఘాట్, గోకుల్ నగర్, గోల్కొండ హోటల్, పెన్షన్ ఆఫీస్, శ్రీరామ్‌టెంపుల్, హైమద్‌నగర్ వరకు సాగింది. యువత బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 13న జరిగే ఎన్నికల్లో ప్రతి ఒక్కరూ ఓటు హక్కును వినియోగించుకోవాలని, పోలింగ్ శాతాన్ని పెంచాలని పిలుపునిచ్చారు. అలాగే జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని పలు బస్తీల్లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు.

## బిజెపి, బిఆర్ఎస్‌లను ఓడించాల్సిందే

అఖిలపక్ష సమావేశంలో నేతల పిలుపు
రామసహాయం గెలుపునకు కృషి

ఖమ్మం,మే9: పార్లమెంట్ ఎన్నికల్లో కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించాలని ప్రతిపక్ష పార్టీలకు డిపాజిట్లు గల్లంతు చేయాలని అఖిలపక్ష పార్టీలు కోరాయి. బిజెపి, బిఆర్ఎస్ పార్టీలను చిత్తుగా ఓడించాలని పిలుపునిచ్చాయి. కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామసహాయం రఘురామిరెడ్డి విజయాన్ని కాంక్షిస్తూ ఆదిలక్ష్మి కోల్డ్ స్టోరేజ్ ఆత్మీయ సమావేశం జరిగింది. ఈ ఆత్మీయ సమావేశానికి ముఖ్య అతిథులుగా కాంగ్రెస్ ఎంపీ అభ్యర్థి రామ సహాయం రఘురాంరెడ్డి, మాజీ కేంద్ర మంత్రి, రాజ్యసభ సభ్యురాలు రేణుక చౌదరి, తుమ్మల యుగంధర్, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, పొంగులేటి ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


# శ్రీ ప్రస్థానం

## సంపాదకీయం

## భగభగ మండుతున్న భూగోళం

భూగోళం భగభగ మండిపోతోంది. చరిత్రలోనే ఎన్నడూ లేని గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇది ఎక్కడో సహారా ఎడారిలోనో.. మరే ఉష్ణమండల ప్రాంతంలోనో కాదు.. యావత్ భూగోళమే అధిక ఉష్ణోగ్రతలతో సతమతమవుతోంది. తాజాగా కొద్ది రోజుల క్రితం ముగిసిన ఏప్రిల్ నెల చరిత్రలోనే అత్యంత గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైన నెలల్లో ఒకటిగా రికార్డుల్లోకెక్కింది. గత 11 నెలలుగా ప్రపంచవ్యాప్తంగా ప్రతి నెల రికార్డు స్థాయిలో గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఇది కేవలం ప్రారంభం మాత్రమేనని, రానున్న రోజుల్లో ఇలాంటి విపత్తులు మరిన్ని ఎదుర్కోక తప్పదని వాతావరణ శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. యూరోపియన్ యూనియన్ వాతావరణ విభాగం "కోపర్నికస్ క్లైమెట్ ఛేంజ్ సర్వీస్ (అ3ూ)" ప్రకారం భూగోళంపై అత్యధిక ఉష్ణోగ్రతలు నమోదైన నెలగా ఏప్రిల్ నిలిచింది. ఈ సంస్థ అంచనాల ప్రకారం 2023 కంటే 2024 మరింత వేడి సంవత్సరంగా నిలవనుంది. ప్రపంచవ్యాప్తంగా నమోదయ్యే ఉష్ణోగ్రతల్లో హెచ్చుతగ్గులను గుర్తించేందుకు కొలమానంగా ప్రపంచీకరణకు ముందు, ప్రపంచీకరణ తర్వాత గణాంకాలను పరిశీలిస్తారు. ఆ ప్రకారం 1850-1900 మధ్యకాలంలో రికార్డయిన ఉష్ణోగ్రతలను బేస్‌లైన్‌గా తీసుకుని తదుపరి నమోదైన ఉష్ణోగ్రతలను పోల్చి చూస్తుంటారు. ఆ ప్రకారం గత ఏప్రిల్ నెలలో ప్రపంచవ్యాప్తంగా సగటున 1.58 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. 1991 ? 2020 మధ్యకాలంలో నమోదైన ఉష్ణోగ్రతలతో పోల్చి చూస్తే సగటు 0.67 డిగ్రీల సెల్సియస్ అధిక ఉష్ణోగ్రతలు రికార్డయ్యాయి. ఈ లెక్కల ప్రకారం గత 174 ఏళ్లలో 2023 అత్యంత అధిక ఉష్ణోగ్రతలు నమోదైన సంవత్సరంగా రికార్డు సృష్టించింది. ఏడాది సగటు ఉష్ణోగ్రతలు బేస్‌లైన్ (1850-1900) సగటు ఉష్ణోగ్రత కంటే 1.45 డిగ్రీల సెల్సియస్ అధికం. ఈ ఏడాది (2024) గత ఏడాది కంటే అధిక వేడి సంవత్సరంగా నమోదయ్యే అవకాశం ఉందని నిపుణులు సూచిస్తున్నారు. భూమ్మీద నానాటికీ పెరిగిపోతున్న ఉష్ణోగ్రతలకు కారణం ఒక్క ముక్కలో చెప్పాలంటే మనిషే. మనిషులు తమ అవసరాలకు మించి ప్రకృతిని నాశనం చేస్తున్నారని పర్యావరణ ప్రేమికులు నిందిస్తుంటారు. పారిశ్రామికరణ కారణంగా వాతావరణంలో గ్రీన్‌హౌజ్ వాయువులైన కార్బన్ డై ఆక్సైడ్ (అూ2), మిథేన్‌ల సాంద్రత వేగంగా పెరగవడం వల్ల భూవాతావరణంలో ఉష్ణోగ్రతలు 185-1900 సగటుతో పోల్చితే ఇప్పటికే దాదాపు 1.15 డిగ్రీల సెల్సియస్ పెరిగాయి. 2023లో ఆ సగటు పెరుగుదల 1.45 డిగ్రీల సెల్సియస్‌గా నమోదైంది. ప్రపంచ సగటు ఉష్ణోగ్రత మొదటిసారిగా జనవరిలో మొత్తం సంవత్సరానికి 1.5 డిగ్రీల సెల్సియస్ థ్రెషోల్డ్‌ను దాటింది. ఈ గణాంకాలు వాతావరణ నిపుణులను భయపెడుతున్నాయి. భూమ్మీద శరవేగంగా అడవులు తరిగిపోతున్నాయి. వాతావరణ సమతౌల్యత దారుణంగా దెబ్బతింటోంది. అసలు వర్షం అన్నదే ఎరుగని ఎడారి ప్రాంతాల్లో భారీ వర్షాలే కాదు, అతలాకుతలం చేసే స్థాయిలో వరదలు సంభవిస్తున్నాయి. రుతుపవనాలపై ఆధారపడ్డ భారత్ వంటి దేశాల్లోనూ వాతావరణ మార్పుల ప్రభావం స్పష్టంగా కనిపిస్తోంది. ఇదివరకు వర్షాకాలంలో వారం రోజుల పాటు ఓ మోస్తరుగా కురిసే వర్షాలు ఒకట్రెండు గంటల్లో కురిసి మళ్లీ వర్షం జాడ లేకుండా పోతోంది. గణాంకాల ప్రకారం చూస్తే సగటు వర్షపాతానికి అటూఇటూగానే ఉంటున్నప్పటికీ.. వర్షాలు కురిసే తీరులో తీవ్రమైన మార్పులు చోటుచేసుకుంటున్నాయి. బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో ఏర్పడే తుఫాన్ల తీవ్రత కూడా పెరుగుతోంది. మొత్తంగా ప్రకృతిలో సహజసిద్ధంగా ఉండాల్సిన వాతావరణంలో పెనుమార్పులు చాలా స్పష్టంగా కనిపిస్తున్నాయి. బంగ్లాదేశ్‌లో అధిక ఉష్ణోగ్రతల ధాటికి పాఠశాలలు మూసివేయాల్సి వచ్చింది. భారత్‌లోని దక్షిణాది రాష్ట్రాలతో పాటు వియత్నాం, ఫిలిప్పైన్స్ వంటి వరి ఎక్కువగా పండించే ప్రాంతాల్లో ఎండిపోయి బీటలువారిన పొలాల దృశ్యాలు కనిపిస్తున్నాయి. ప్రస్తుతం దేశంలో జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల్లో ఓటర్లు ఈ ఎండవేడికి తాళలేక సతమతమవుతున్నారు. కొన్ని రాష్ట్రాల్లో నమోదవుతున్న అత్యల్ప పోలింగ్ శాతానికి కారణం ఈ ఉష్ణోగ్రతలేనని ఎన్నికల అధికారులు అభిప్రాయపడుతున్నారు. ఇండోనేషియా, మలేషియా, మయన్మార్‌తోపాటు భారత్‌లోనూ ఉష్ణోగ్రత రికార్డులు బద్దలయ్యాయి. వీటన్నింటికీ కారణం మనిషి తన అవసరాలకు మించి చేస్తున్న పారిశ్రామికరణ, వాహన ఉద్గారాల ద్వారా భూ ఉపరితలంలో పెరిగిపోతున్న గ్రీన్‌హౌజ్ వాయువులేనని నిపుణులు సూత్రీకరిస్తున్నారు. శిలాజ ఇంధనాలు (బొగ్గు, పెట్రోలియం ఉత్పత్తులు) వినియోగం పెరగడం వల్ల వాతావరణంలో గ్రీన్‌హౌజ్ వాయువుల సాంద్రత నానాటికీ పెరుగుతోంది. పసిఫిక్ మహాసముద్రంలో ప్రకృతి సహజసిద్ధంగా ఏర్పడే ఎల్-నినో, లా-నినా వంటి పరిస్థితులు భారత్‌లో రుతుపవనాలను, వర్షపాతాన్ని ప్రభావితం చేస్తున్నాయి. ఎల్-నినో ఏర్పడినప్పుడు రుతుపవనాలు బలహీనంగా మారి సాధారణంగా కంటే తక్కువ వర్షపాతాన్ని కల్గిస్తాయి. లా-నినా వంటి పరిస్థితులు రుతుపవనాలకు మరింత బలాన్నిచ్చి అధిక వర్షాలు కురిపిస్తాయి. ఈ తరహా పరిస్థితి సగటున ప్రతి రెండేళ్ల నుంచి ఏడేళ్ల మధ్యకాలంలో ఏర్పడుతుంటాయి. అలాగే ఎల్-నినో లేదా లా-నినా ఏర్పడితే సాధారణంగా 9 నెలల నుంచి 12 నెలల వరకు కొనసాగుతుంది. ఇవి సముద్ర ఉష్ణోగ్రతలో చోటుచేసుకునే మార్పుల కారణంగా ఏర్పడుతుంటాయి. ఏప్రిల్ నెలలో ప్రపంచవ్యాప్తంగా సముద్ర ఉష్ణోగ్రతలు రికార్డు స్థాయికి చేరుకున్నాయి.

## కాంగ్రెస్ కు తలనొప్పిగా మారిన పిట్రోడా



న్యూఢిల్లీ, మే 9, దక్షిణాది భారతదేశానికి చెందినవారు ఆఫ్రికన్ల లాగా, ఈశాన్య భారతదేశంలో ప్రజలు చైనీయుల లాగా, ఉత్తర భారత దేశానికి చెందినవారు తెల్లగా, పశ్చిమ భారతదేశంలో వారు అరబ్బుల్లాగా కనిపిస్తారని కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ చీఫ్ శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు ఎన్నికల ముందు దేశంలో పెద్ద దుమారానికి కారణమయ్యాయి. శామ్ చేసిన ఈ వ్యాఖ్యలను ప్రధానమంత్రి నరేంద్ర మోడీ తీవ్రంగా పరిగణించారు. "ఇది కాంగ్రెస్ పార్టీ వారి అసలు ముఖచిత్రం. వారు వారసత్వ పన్ను వేస్తారు. దేశాన్ని విభజిస్తారు. ఒక కుటుంబం కోసం ఏదైనా చేస్తారు. శామ్ చేసిన వ్యాఖ్యలు ఆయన వ్యక్తిగతం కాదు. అవి కాంగ్రెస్ పార్టీ అసలు ముఖచిత్రాన్ని ప్రదర్శిస్తున్నాయని" మోడీ విమర్శించారు. ఇక ఎన్నికల ముందు శామ్ చేసిన వ్యాఖ్యలు కాంగ్రెస్ పార్టీ కి ఇబ్బంది కలగజేస్తున్నాయి.. సోషల్ మీడియాలో సైతం శామ్ పై విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. చాలామంది ఇండియా కూటమి, రాహుల్ గాంధీ ని టార్గెట్ చేసుకొని ఆరోపణలు చేస్తున్నారు. ఇంటా బయటా విమర్శలు తీవ్రం కావడంతో శామ్ పిట్రోడా తన పదవికి రాజీనామా చేశారు. శామ్ పిట్రోడా ప్రస్తుతం కాంగ్రెస్ పార్టీ ఓవర్సీస్ చైర్మన్ గా కొనసాగుతున్నారు. బుధవారం ఆయన చేసిన వ్యాఖ్యలు పెను దుమారానికి కారణమయ్యాయి. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ అధిష్టానం నష్ట నివారణ చర్యలకు దిగింది. అధిష్టానం అంతరంగాన్ని అర్థం చేసుకున్న శామ్ పిట్రోడా తన పదవికి రాజీనామా చేశారు. దీనిని కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే ఆమోదించారు. శామ్ పిట్రోడా రాజీనామాను కాంగ్రెస్ పార్టీ సీనియర్ జై రామ్ రమేష్ ట్విట్టర్ ఎక్స్ ద్వారా ప్రకటించారు. వాస్తవానికి శామ్ పిట్రోడా అలాంటి వ్యాఖ్యలు చేసే ముందు కొంచెం జాగ్రత్తగా ఉండాల్సింది. ప్రస్తుతం దేశభక్తి అనేది తారాస్థాయిలో ఉన్న నేపథ్యంలో..

ఒక బాధ్యత గల రాజకీయ నాయకుడిగా ఆయన అలాంటి వ్యాఖ్యలు చేయడం కాంగ్రెస్ పార్టీకి ప్రతిబంధకంగా మారింది.. ఆఫ్రికన్లు, చైనీయులు, అరబ్బులతో భారతదేశ ప్రజలను పోల్చడం నిజంగా శామ్ పిట్రోడా అవివేకానికి నిదర్శనం. శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలు మంటలు రేపుతున్న నేపథ్యంలో.. కాంగ్రెస్ పార్టీ నాయకులు ఆ వివాదంపై నోరు మెదపకుండా సైలెంట్ గా ఉన్నారు. శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యల పట్ల మేధావులు సైతం ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. "కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు అనేక విప్లవాత్మక నిర్ణయాలను తెరపైకి తీసుకొచ్చిన వ్యక్తి ఇలాంటి వ్యాఖ్యలు చేయడం సరికాదని"అంటున్నారు.. మరోవైపు ఈ వ్యాఖ్యలు ఆమోదయోగ్యం కాదని, అటువంటి వాటిని ఇండియా కుటమి సమర్థించదని ఆప్ నేత సంజయ్ సింగ్ పేర్కొన్నారు. శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యల నేపథ్యంలో.. సోషల్ మీడియాలో ఆయనకు వ్యతిరేకంగా పోస్టులు వెల్లువెత్తుతున్నాయి.. నిన్నటిదాకా ప్రజ్వల్ ఉదంతంతో తీవ్రంగా ఇబ్బంది పడ్డ భారతీయ జనతా పార్టీకి.. శామ్ పిట్రోడా చేసిన వ్యాఖ్యలతో కాస్త ఉపశమనం లభించినట్టయింది.

## ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు రాష్ట్ర ప్రధాన ముస్లిం మైనార్టీ సంస్థ మద్దతు



హైదరాబాద్ : నాగర్‌కర్నూల్ బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు అన్ని వర్గాల నుంచి విశేషమైన మద్దతు లభిస్తోంది. ఆర్ఎస్పీని గెలిపించి, పార్లమెంట్‌కు పంపిస్తామని నాగర్‌కర్నూల్ పార్లమెంట్ ప్రజానీకం నినదిస్తున్నారు. ఈ క్రమంలోనే రాష్ట్ర ప్రధాన ముస్లిం మైనార్టీ సంస్థ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు మద్దతు ప్రకటించింది. నాగర్‌కర్నూల్ పార్లమెంట్ నియోజకవర్గంలోని పరిధిలోని ముస్లింలంతా ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్‌కు ఓటు వేయాలని ముస్లిం మైనార్టీ సంస్థ ప్రతినిధులు విజ్ఞప్తి చేశారు. నిజమైన సెక్యులర్ కేసీఆర్ అని వారు స్పష్టం చేశారు. బీఆర్ఎస్‌తోనే మైనార్టీల బతుకులు బాగు పడుతాయన్నారు. ముస్లింలకు బీజేపీ, కాంగ్రెస్ పార్టీ చేసిందేమీ లేదని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.

## ఎన్నికల పనుల్లో చేతి వాటం....

హైదరాబాద్, మే 9, ఎలక్షన్స్ వచ్చాయంటే చాలు వారికి ఫుల్ హ్యాపీ.... వాస్తవానికి వారు జీహెచ్ఎంసీలో పనులు చేయించాల్సిన ఇంజనీర్లు. కానీ ఎన్నికలొచ్చాయంటే చాలు వారు కాంట్రాక్టర్లుగా మారిపోతారు. అడపాదడపా పనులు చేయించే లైసెన్స్ కలిగిన కాంట్రాక్టర్లను బినామీలుగా పెట్టుకుని పబ్బం గడుపుకుంటున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ఎన్నికలకు సంబంధించి లైటింగ్, వీడియో, డీఆర్సీ సెంటర్లు, పోలింగ్ స్టేషన్ల ఏర్పాటు పనులు, స్ట్రాంగ్ రూమ్‌ల నిర్మాణం, డీఆర్సీ సెంటర్లలోని సిబ్బందికి భోజనాలు వంటి పనులను కొటేషన్లు, షార్ట్ టెండర్ల ప్రక్రియలతో కేటాయించాలని గత అసెంబ్లీ ఎన్నికలకు ముందే జిల్లా ఎన్నికల అధికారి లిఖితపూర్వకమైన ఆదేశాలు జారీ చేసినా క్షేత్ర స్థాయిలో అవి ఏమాత్రం అమలు కావడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి అడ్డదారిలో ఎలక్షన్స్ పనులు చేజిక్కించుకుని తమ బినామీ కాంట్రాక్టర్లకు కట్టబెడుతూ జీహెచ్ఎంసీ ఇంజనీర్లు, అధికారులు అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం మార్గదర్శకాలతో పాటు జిల్లా ఎన్నికల అధికారి ఆదేశాల మేరకు ఏ పనికైనా టెండర్ల ప్రక్రియ చేపట్టి, అందులో తక్కువగా కోడ్ చేసిన కాంట్రాక్టర్‌కు గానీ, సంస్థకు గానీ పనులు కేటాయించాల్సి ఉంది. మరీ అర్జెంట్ అయితే కనీసం కొటేషన్లను తీసుకోనైనా, లేక షార్ట్ టెండర్ల ప్రక్రియను నిర్వహించైనా పనులు చేపట్టాలని నిబంధనలు చెబుతుంటే జీహెచ్ఎంసీ ఇంజనీర్లు మాత్రం పనులను నామినేషన్ పద్ధతిని కట్టబెడుతున్నట్లు ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. జీహెచ్ఎంసీ కాంట్రాక్టర్స్ అసోసియేషన్ ఇచ్చిన ఫిర్యాదు మేరకే జిల్లా ఎన్నికల అధికారి లిఖిత పూర్వకమైన ఆదేశించినట్లు సమాచారం. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఖైరతాబాద్ జోన్‌లోని నాంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూం నిర్మాణ పనులను ఓ ఇంజనీర్ చేజిక్కించుకుని తన ఇద్దరు బినామీ కాంట్రాక్టర్లతో పనులు చేయించిన విషయం ఇటీవలే బయటపడినా కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోలేదన్న విషయం చర్చనీయాంశంగా మారింది. ఇప్పుడు కూడా పార్లమెంట్ ఎన్నికల్లో భాగంగా మాసాబ్ ట్యాంక్ సాంకేతిక భవన్‌లో నిర్మించిన నాంపల్లి నియోజకవర్గం స్ట్రాంగ్ రూమ్ నిర్మాణ పనులు సదరు ఇంజనీరే చేజిక్కించుకున్నట్లు చర్చ జరుగుతుంది. పాతబస్తీలోని చాంద్రాయణగుట్ట నియోజకవర్గానికి చెందిన ఆఫీసర్ నిజాంకాలేజీలో ఏర్పాటు చేసిన డీఆర్సీ సెంటర్‌లోని స్టాఫ్‌కు టీ, టిఫిన్, భోజనాలకు సంబంధించిన కాంట్రాక్టును చేజిక్కించుకున్నట్లు సమాచారం. సదరు ఆఫీసర్ ఆ టీ, టిఫిన్, భోనాలను నిజాం కాలేజీ క్యాంటీన్ నుంచే సమకూర్చి భారీగా అక్రమార్జనకు పాల్పడుతున్నట్లు సమాచారం. ఇదే రకంగా ఖైరతాబాద్ జోన్‌లో మరో ఇంజనీర్, ఉప్పల్‌లో ఓ ఇంజనీర్ పనులు చేజిక్కించుకున్నట్లు సమాచారం. ఎలక్షన్ పనులను నిబంధనలు ఉల్లంఘించి నామినేషన్ పద్ధతిన కేటాయిస్తున్నా, ఉన్నతాధికారులు ఎందుకు మౌనం వహిస్తున్నారన్నది చర్చనీయాంశంగా మారింది. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో భాగంగా నాంపల్లి నియోజకవర్గానికి సంబంధించిన స్ట్రాంగ్ రూమ్ నిర్మాణ పనులు ఖైరతాబాద్ జోన్‌లోని మెహిదీపట్నంకు చెందిన ఇంజనీర్ చేపట్టిన విషయం ఇటీవలే బట్టబయలైన, కమిషనర్ గానీ, జిల్లా ఎన్నికల అధికారి గానీ, ఇంజనీర్ ఇన్ చీఫ్ గానీ ఎందుకు చర్యలు చేపట్టలేదన్న విషయం హాట్ టాపిక్‌గా మారింది. అడ్డదారిలో పనులు చేజిక్కించుకుంటున్న వారికి అప్పగించటమే వారిపై చర్యలు తీసుకోక పోవడానికి ప్రధాన కారణమా? అంటూ జీహెచ్ఎంసీ సిబ్బంది చర్చించుకోవడం కనిపించింది.

## సిటీ ఖాళీ....

### కారులో షేరింగ్ ఇస్తామంటూ..

హైదరాబాద్, మే 9 హైదరాబాద్ నగరం ఖాళీ కానుంది. ఈ నెల 13వ తేదీన ఆంధ్రప్రదేశ్ లో శాసనసభ ఎన్నికలు జరుగుతున్నాయి. దీంతో హైదరాబాద్ నగరంతో పాటు తెలంగాణలోని పలు జిల్లాల నుంచి సీమాంధ్రులు తమ సొంతూళ్లకు బయలుదేరి వెళుతున్నారు. ఇందుకోసం ఇప్పటికే ఆర్టీసీ, ప్రయివేటు బస్సులను ముందుగానే బుక్ చేసుకున్నారు. ఆర్టీసీ బస్సులలో టిక్కెట్లన్నీ ముందుగానే బుక్ అయిపోయాయి. ప్రయివేటు బస్సులలో అత్యధిక ఫీజులను వసూలు చేస్తున్నా ఎన్నికల కోసం సీమాంధ్రులు వారి సొంతూళ్లకు బయలుదేరి వెళుతున్నారు. దీంతో రేపు హైదరాబాద్ నగరం దాదాపు ఖాళీ అవుతందన్నది మాత్రం వాస్తవం. వరసగా సెలవులు మూడు రోజులు రావడంతో అత్యధిక మంది నగరం నుంచి సొంతూళ్లకు బయలుదేరుతున్నారు. ప్రధానంగా శని, ఆదివారాలు ఐటీ కంపెనీలకు సెలవులు కావడం, పోలింగ్ తేదీన కూడా అధికారికంగా ఐటీ సంస్థలన్నీ సెలవులు ప్రకటించడంతో అందరూ మూడు రోజుల పాటు తమ సొంతూళ్లకు బయలుదేరి వెళుతున్నారు. కేవలం ఐటీ కంపెనీలలో పనిచేసే ఉద్యోగులు మాత్రమే కాకుండా సాధారణ ప్రజలు, కూలీ పనులు చేసుకునే వారు సయితం సొంతూళ్లకు బయలుదేరి వెళుతున్నారు. ఇప్పట్లో మళ్లీ ఇన్ని రోజులు వరస సెలవులు వచ్చే అవకాశం లేకపోవడంతో ఈ మూడు రోజులు సొంత గ్రామంలో ఎంజాయ్ చేయడానికి బయలుదేరుతున్నారు. పోలింగ్ అంటే ఒక పండగ. అదీ తమ సొంతూళ్లలో తమకు నచ్చిన వాళ్లకు ఓటేయాలన్నది కోరిక. దీంతో పాటు ఇక్కడ ఉన్న వారిని రప్పించేందుకు ఏపీకి చెందిన రాజకీయ పార్టీల నేతలు అనేక ప్రయివేటు వాహనాలను కూడా అరేంజ్ చేశారు. లారీలు, బస్సులతో పాటు కార్లను కూడా వినియోగించుకుంటున్నారు. అయితే ఎక్కడా చోటు దొరకని వారికి మాత్రం కార్లలో వెళ్లేందుకు ఛాన్స్ ఉందంటూ సోషల్ మీడియాలో షేరింగ్ ప్రపోజల్స్ కనపడుతున్నాయి. విశాఖపట్నం, గుంటూరు, విజయవాడ, తిరుపతి వరకూ వెళ్లేందుకు అనేక మంది తమ కార్లలో చోటు ఉందని, వచ్చే వారు ఇంత మొత్తం చెల్లించాల్సి ఉంటుందని, వాళ్లు అవుటర్ రింగ్ రోడ్డు వద్దకు వచ్చి తమ వాహనాన్ని అందుకోవాలని పోస్టింగ్ లు పెడుతున్నారు. ప్రయివేటు బస్సులతో పోలిస్తే తక్కువ ధర కావడంతో కార్లలో వెళ్లేందుకు ఎక్కువ మంది మొగ్గు చూపుతున్నారు. మొత్తం మీద సాయంత్రం నుంచి జాతీయ రహదారులన్నీ వాహనాలతో రద్దీగా మారిపోవడం ఖాయం.

## ఊరెళ్తున్న మహా నగరం

హైదరాబాద్, మే 9 : ఎన్నికలకు మరో 3 రోజుల సమయం మాత్రమే ఉండడంతో నగర ప్రజలు తమ సొంతూళ్లకు పయనం అవుతున్నారు. పిల్లలకు వేసవి సెలవులు, ఇటు ఎన్నికలు ఉండడంతో వారం రోజుల ముందే ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళుతున్నారు. ఈనెల 13న తెలంగాణలో లోక్ సభ ఎన్నికలకు పోలింగ్......ఆంధ్రప్రదేశ్ లో అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికలకు పోలింగ్ జరగనున్న సంగతి తెలిసిందే. ఏపీకి చెందిన నగరవాసులకు హైదరాబాద్ తో పాటు తమ సొంత గ్రామాల్లో కూడా ఓటు హక్కు ఉండడంతో.... గ్రామాల్లో తమ ఉనికిని కాపాడుకోవడం కోసం అక్కడ కూడా తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఈ నేపథ్యంలోనే హైదరాబాద్ నుంచి పెద్ద సంఖ్యలో ప్రజలు తమ సొంత గ్రామాలకు వెళుతున్నారుహైదరాబాద్ నుంచి ఏపీకి వెళ్లే ఆర్టీసీ బస్సులకు, రైళ్లకు భారీ డిమాండ్ పెరిగింది. హైదరాబాద్ నుంచి విశాఖ, తిరుపతి, కాకినాడ, గుంటూరు ప్రాంతాలకు వెళ్లే రెగ్యులర్ ట్రైన్స్ ఇప్పటికే రద్దీ పెరుగుతుంది. ఎండాకాలం కావడంతో ఏసీ కోచ్ లలో రిజర్వేషన్లు కూడా త్వరగా ముగుస్తున్నాయి. ఇటు దక్షిణ మధ్య రైల్వే ప్రయాణికుల రద్దీని దృష్టిలో పెట్టుకొని ప్రత్యేక రైళ్లను ఏర్పాటు చేసినప్పటికీ......గడిచిన రెండు రోజుల్లో ప్రయాణికుల రద్దీ విపరీతంగా పెరిగిందని రైల్వే అధికారులు వెల్లడించారు. సాధారణంగా సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి రోజుకు 1.85 లక్షలు రాకపోకలు సాగిస్తే.....గత కొద్ది రోజులుగా ఆ సంఖ్య దాదాపు 3 లక్షలకు చేరిందని అధికారులు అంటున్నారు. అయితే ఈసారి సాఫ్ట్వేర్ ఉద్యోగులు, ప్రభుత్వ ప్రైవేటు ఉద్యోగులు, కార్మికులు, వాచ్ మెన్లు, సెక్యూరిటీ గార్డులుగా పని చేసే లక్షలాది మంది ప్రజలు తమ ఓటు హక్కును వినియోగించుకునేందుకు ఆసక్తి చూపడం గమనార్హం. ఇదిలా ఉంటే హైదరాబాద్ లో స్థిరపడ్డ ఏపీ ప్రజలను తమ సొంతూళ్లకు తరలించేందుకు రాజకీయ పార్టీలు ప్రైవేట్ బస్సులను కూడా ఏర్పాటు చేసే ఆలోచనలో ఉన్నాయట. హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సులకు సైతం భారీగా డిమాండ్ పెరిగింది. సుమారు 1500 ఆర్టీసీ బస్సులు ఏపీలోని వివిధ ప్రాంతాలకు రాకపోకలు సాగిస్తున్నాయి. ప్రస్తుతం రద్దీని దృష్టిలో ఉంచుకొని అదనపు బస్సులను నడిపేందుకు ఆంధ్రప్రదేశ్ రోడ్డు రవాణా సంస్థ ఆలోచిస్తుంది. ఇటు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ సైతం హైదరాబాద్ నుంచి వివిధ ప్రాంతాలకు వెళ్లే బస్సుల సంఖ్యను పెంచేందుకు యోచిస్తోంది. ఆర్టీసీ బస్సుల సంగతి ఇలా ఉంచితే.....అటు ప్రైవేట్ ట్రావెల్స్ బస్సులకు సైతం విపరీతంగా డిమాండ్ పెరుగుతుంది. ఇదే అదునుగా ప్రైవేట్ ట్రావెల్స్ యజమానులు దండుకునేందుకు ప్రయత్నాలు చేస్తున్నారట. ప్రైవేట్ బస్సులో బుకింగ్స్ కూడా పెరిగిపోయాయి. సాధారణం కంటే నగరంలో 1000 ప్రైవేట్ బస్సులు అదనంగా ఏపీకి రాకపోకలు సాగిస్తున్నాయి. ముఖ్యంగా ప్రధాన రద్దీ ప్రాంతాలైన ఉప్పల్, ఎల్బీ నగర్, సికింద్రబాద్, కేపీహెచ్బీ నుంచి అధిక బస్సులు రాకపోకలు సాగిస్తున్నాయి

## నేడు స్టాక్ మార్కెట్ నుంచి రూ. 6 లక్షల కోట్లు ఆవిరి

### 1000 పాయింట్లకు పైగా పడిపోయిన సెన్సెక్స్

ముంబై: వరుసగా ఐదు రోజులుగా మార్కెట్ సూచీలు పడిపోతూ వచ్చాయి. నేడు కూడా భారీగా పడిపోయాయి. లోక్ సభ ఎన్నికలు, క్రూడాయిల్ పెరుగుదల, ఇతర కారణాలు మార్కెట్ ను పడగొట్టాయి. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 1046.65 పాయింట్లు లేక 1.42 శాతం పతనమై 72419.74 వద్ద ముగిసింది. కాగా నిఫ్టీ 335.41 పాయింట్లు లేక 1.50 శాతం పతనమై 21967.10 వద్ద ముగిసింది. నిఫ్టీలో ప్రధానంగా హిరోమోటోకార్పొ, టాటా మోటార్స్, ఎం అండ్ ఎం, ఎస్ బిఐ లాభపడగా, నష్టపోయిన షేర్లలో ఎల్ అండ్ టి, బిపిసిఎల్, ఏషియన్ పెయింట్స్, కోల్ ఇండియా లి. ఉన్నాయి.



## ఎమ్మెల్యేలకు వేణుగోపాల్ స్వీట్ వార్నింగ్

హైదరాబాద్, మే 9, ఎమ్మెల్యేల పనితీరు ఆధారంగానే వారికి పదవులు ఉంటాయని ఏఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ పేర్కొన్నారు. ఎన్నికలకు మరో ఐదు రోజులే ఉన్నందున రాష్ట్రంలోని రాజకీయ పరిణామాలపై ఎఐసిసి ప్రధాన కార్యదర్శి కెసి వేణుగోపాల్ కాంగ్రెస్ నాయకులతో జూమ్ ద్వారా అత్యవసర సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సిఎం భట్టి విక్రమార్క, దీపాదాస్ మున్షీ, మంత్రు లు, ఎమ్మెల్యేలు, లోక్‌సభ నియోజకవర్గాల అభ్యర్థులు, ఇన్‌చార్జీలు పాల్గొన్నారు. ఈ భేటీకి మంత్రి దామోదర రాజనర్సింహ, 15 మం ది ఎమ్మెల్యేలు గైర్హాజరు కావడంపై కెసి వేణుగోపాల్ అసహనం వ్యక్తం చేశారు. లోక్‌సభ ఎన్నికల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన ప లువురు నేతల పట్ల ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. గంటకు పైగా సాగిన ఈ జూమ్ మీటింగ్‌లో పార్టీ నేతలకు ఆయన దిశానిర్దేశం చే శారు. అలాగే పార్లమెంట్ ఎన్నికల ప్రచారం, నియోజకవర్గాల్లో పా ర్టీల బలాబలాలు తదితరాల అంశాలపై సిఎం రేవంత్ రెడ్డి, విక్రమార్క, దీపాదాస్ మున్షీ, మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డిలు వివరించా రు. ఈ సందర్భంగా కెసి వేణుగోపాల్ మాట్లాడుతూ తెలంగాణలో అధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించబోతుందని, అందుకో సం మరింత ఉత్సాహంతో పని చేయాలని ఆయన సూచించారు. తెలంగాణాలో అధిక స్థానాల్లో కాంగ్రెస్ విజయం సాధించబోతుందని ఆయన పేర్కొన్నారు. నల్గొండ లోక్‌సభ నియోజకవర్గ బాధ్యతను మంత్రి ఉత్తమ్‌కుమార్ రెడ్డి, మాజీ మంత్రి జానారెడ్డి చూసుకుంటారని కెసి వేణుగోపాల్ స్పష్టం చేశారు. సికింద్రాబాద్ స్థానాన్ని నిర్లక్ష్యం చేయటంపై ఇన్‌చార్జ్ మంత్రి కోమటిరెడ్డి వెంకటరెడ్డిపై కెసి వేణగోపాల్ అసహనం వ్యక్తం చేశారు. అభ్యర్థి గెలుపును ప్రతిష్టాత్మకంగా తీసుకోవాలని ఆయన నిర్దేశించారు. నియోజకవర్గంలోనే ఉండి గెలుపు కోసం కృషి చేయాలన్నారు.






## తాతామనవళ్లుగా తండ్రీకొడుకులు.. క్రేజీ ప్రాజెక్ట్

టాలీవుడ్ కమెడియన్, హాస్య బ్రహ్మ బ్రహ్మానందానికి రెండు తెలుగు రాష్ట్రాల్లో విశేషమైన ఫాలోయింగ్ ఉన్న విషయం తెలిసిందే. ఎన్నో హిట్ సినిమాల్లో నటించి తన కామెడీతో అన్ని వర్గాల ప్రేక్షకులను మెప్పించారు. ఆయన తెరపై కనిపిస్తే చాలు.. ఆడియన్స్ నవ్వేస్తారు. అంతలా క్రేజ్ సంపాదించుకున్నారు బ్రహ్మానందం. ఇప్పటి వరకు దాదాపు అందరి హీరోలతో సినిమాలు చేసిన ఆయన.. తొలిసారి కొడుకుతో మూవీ చేయబోతున్నారు. పెద్ద కొడుకు, హీరో రాజా గౌతమ్ తో కలిసి బ్రహ్మానందం సినిమా చేయనున్నారు. నిజ జీవితంలో తండ్రీకొడుకులైన వీళ్లద్దరూ.. 'బ్రహ్మఆనందం' మూవీలో తాతామనవళ్లుగా కనిపించనున్నారు. ఈ ప్రాజెక్టుకు ఖీూ నిఖిల్ దర్శకత్వం వహించనున్నారు. స్వధర్మ్ ఎంటర్టైన్మెంట్స్ బ్యానర్ పై రాహుల్ యాదవ్ నక్కా నిర్మించనున్నారు. ఇప్పటికే ఈ బ్యానర్ నుంచి వచ్చిన మళ్లీ రావా, ఏజెంట్ సాయి శ్రీనివాస ఆత్రేయ, మసూద చిత్రాలు మంచి హిట్ అయ్యాయి. చిత్రాన్ని కూడా అనౌన్స్ చేశారు రాహుల్ యాదవ్.




తాజాగా 'బ్రహ్మఆనందం' సినిమాను అఫీషియల్ గా ప్రకటిస్తూ ప్రీ లుక్ వీడియోను రిలీజ్ చేశారు. టైటిల్ పోస్టర్ ను కూడా రివీల్ చేశారు. ప్రీ లుక్ పోస్టర్ సినిమాపై పాజిటివ్ బజ్ క్రియేట్ చేస్తోంది. పట్టణ, గ్రామీణ సంస్కృతుల సమ్మేళనంగా పోస్టర్ ఉంది. వీడియోలో బ్రహ్మానందం, వెన్నెల కిశోర్ తమ నెక్ట్స్ మూవీ కోసం ఫన్నీగా సంభాషించుకుంటున్నట్లు చూపించారు. తండ్రీకొడుకులు తాతామనవళ్లుగా సినిమాలో కనిపించడం ఆకట్టుకునే విషయమే. ఈ 'బ్రహ్మఆనందం' సినిమా ఫుల్ ఫన్ ఎంటర్టైనర్ గా ఉండబోతున్నట్లు తెలుస్తోంది. ఈ చిత్రంలో ప్రియా వడ్లమాని, ఐశ్వర్య హోలక్కల్ హీరోయిన్లుగా నటించనున్నారు. స్టార్ కమెడియన్ వెన్నెల కిషోర్ కీలక పాత్ర పోషించనున్నారు. శాండిల్య పీసపాటి మ్యూజిక్ ను అందించనున్నారు. మితేష్ పర్వతనేని సినిమాటోగ్రాఫర్ గా పనిచేయనున్నారు. ఈ మూవీకి ప్రసన్న.. ఎడిటర్ గా వ్యవహరించనున్నారు. త్వరలోనే ఈ సినిమా రెగ్యులర్ షూటింగ్ ను మొదలు పెట్టనున్నారు మేకర్స్. ఈ ఏడాది డిసెంబర్ 6వ తేదీన చిత్రాన్ని విడుదల చేయనున్నట్లు మేకర్స్ ప్రకటించారు. 'బ్రహ్మఆనందం' మూవీలో మనవడు బ్రహ్మగా రాజా గౌతమ్, తాత ఆనంద్ రామమూర్తిగా బ్రహ్మానందం కనిపించనున్నట్లు తెలిపారు. మరి వీరిద్దరి జర్నీ చుట్టూ తిరగనున్న ఈ సినిమా.. ఎలాంటి హిట్ అవుతుందో చూడాలి.

## శింబు 'థగ్ లైఫ్'.. మల్టీస్టారర్ పవర్ఫుల్ రేస్

విలక్షణ నటుడు కమల్ హాసన్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నారన్న విషయం తెలిసిందే. వాటిలో ఒకటి 'థగ్ లైఫ్' చిత్రం. స్టార్ డైరెక్టర్ మణిరత్నం ఈ సినిమాకు దర్శకుడిగా వ్యవహరిస్తున్నారు. ఈ మూవీ కోసం చాలా ఏళ్ల తర్వాత కమల్, మణిరత్నం చేతులు కలిపారు. మద్రాస్ టాకీస్, రాజ్ కమల్ ఫిల్మ్స్ ఇంటర్నేషనల్ సంయుక్తంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నాయి. ప్రస్తుతం ఈ మూవీ షూటింగ్ ఢిల్లీలోని సంకట్ మోచన్ హనుమాన్ మందిర్ లో జరుగుతున్నట్లు టాక్ వినిపిస్తోంది. తాజాగా మేకర్స్... ఈ సినిమా నుంచి క్రేజీ అప్డేట్ ఇచ్చారు. కోలీవుడ్ నటుడు సిలంబరసన్ (శింబు) ఫస్ట్ లుక్ ను బుధవారం ఉదయం విడుదల చేశారు. దాంతోపాటు గ్లింప్స్ ను కూడా రివీల్ చేశారు. అయితే ఈ సినిమాలో శింబు బదులు.. మలయాళ స్టార్ హీరో దుల్కర్ సల్మాన్ నటిస్తున్నారంటూ ఎప్పటి నుంచో వార్తలు వస్తున్నాయి. ఇప్పుడు థగ్ లైఫ్ మేకర్స్.. శింబు గ్లింప్స్ ను విడుదల చేయడంతో ఆ విషయంలో క్లారిటీ వచ్చేసింది. సినిమాలో శింబు పాత్ర ఎలా ఉండబోతుందో తెలియజేస్తూ మేకర్స్ రిలీజ్ చేసిన గ్లింప్స్.. ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ గా మారింది. మూవీపై అంచనాలు పెంచేసింది. శింబు తన మార్క్ ను చూపిస్తూ.. కారులో పిస్తోల్ పట్టుకుని స్టైలిష్ గా ఎంట్రీ ఇస్తున్న విజువల్స్ అదిరిపోయాయి. ఎడారి ఇసుక తిన్నెలపై కారు నడుపుతూ కనిపించిన శింబు.. ఒక్కసారిగా సడెన్ బ్రేక్ వేసి కారును స్కిడ్ చేసిన సీన్ వేరే లెవల్ లో ఉంది. ఇక ఈ మూవీలో శింబు... కమల్ హాసన్ కొడుకు రోల్ పోషిస్తున్నట్లు ఇండస్ట్రీలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ఈ సినిమాకు ఆస్కార్ విన్నర్ ఏఆర్ రెహమాన్ మ్యూజిక్ తోపాటు బ్యాక్ గ్రౌండ్ స్కోర్ అందిస్తున్నారు.



ఐశ్వర్యలక్ష్మి, త్రిష ఫిమేల్ లీడ్ రోల్స్ పోషిస్తున్నారు. కార్తీక్, జోజు జార్జ్ ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. ఈ మూవీ కమల్ హాసన్- ఉదయనిధి స్టాలిన్ సమర్పణలో గ్రాండ్ క్లాసిక్ గ్యాంగ్ స్టర్ డ్రామాగా రూపొందుతోంది. అయితే లోక్ సభ ఎన్నికల వల్ల కొద్దిరోజుల పాటు నిలిచిపోయిన ఈ సినిమా షూటింగ్.. ఇప్పుడు శరవేగంగా జరుగుతోంది. త్వరలోనే మేకర్స్ మరో అప్డేట్ కూడా ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. ఇక కమల్ హాసన్ నటించిన కల్కి మూవీ జూన్ 27వ తేదీన విడుదల కానుంది. ఆ తర్వాత ఇండియన్-2 మూవీ కూడా ప్రేక్షకుల ముందుకు రానుంది. మరి వరుస చిత్రాలతో కమల్ హాసన్ ఎలాంటి హిట్లు అందుకుంటారో చూడాలి.

## ఒత్తిడితో కడుపునొప్పి సమస్యలు



ఒత్తిడితో గుండె సంబంధ వ్యాధులు, హిస్టీరియా వస్తాయని విన్నాంకాని? ఒత్తిడికీ, పొట్టకి ఏంటి సంబంధం అనుకుంటున్నారా? సంబంధం ఉంది. మెదడు నుండి పొట్టలోకి ఒక నరం ప్రవహిస్తూ ఉంటుంది. కోపం లేదా ఆందోళనగా ఉన్నపుడు ఈ నరం ఆ ప్రభావాల్ని పొట్టలోకి చేరుస్తుంది. ఇవి జీర్ణక్రియలో తోడ్పడే ప్రత్యేకమైన కణాలను ప్రభావితం చేసి, జీర్ణరసాయనాలు ఎక్కువ మోతాదులో విడుదలయ్యేలా చేస్తాయి. దీనివల్ల పొట్టలో నొప్పి, గ్యాస్, జీర్ణం కాకపోవడం, అసిడిటి లాంటి సమస్యలు తరచుగా తలెత్తుతుంటాయి. అనుభవజ్ఞులైన వైద్యులకు మీ సమస్య ఏంటో ఇట్టే అర్థమవుతుంది. అందుకే సమస్య ఏమీ లేదు ప్రశాంతంగా ఉండడానికి ప్రయత్నించండి అంటూ వైద్యులు సలహా ఇస్తారు. లగ్నం చేయండి. మీరు చేసేది కరెక్టే అయినపుడు ఆందోళన పడాల్సిన పని లేదు కదా! ఆందోళన లేనపుడు మీ మెదడు అనవసర విషయాలతో, అవిశ్రాంతంగా, ఒత్తిడిగా, నిస్సత్తువగా లేకుండా ప్రశాంతంగా, చురుకుగా ఆలోచించగ లుగుతుంది. ఆఫీసులో అయినా, ఇంట్లో అయినా ఇదే విధానం పనిచేస్తుంది. ఈసారి పొట్టకు సంబంధించిన సమస్యలు తలెత్తినపుడు వెంటనే డాక్టర్ దగ్గరికి పరిగెత్తకుండా ఇలా చేసి చూడండి. తర్వాత అవసరమైతే డాక్టర్ని సంప్రదించవచ్చు. ప్రశాంతత? ప్రశాంతత రోడ్డుమీద నడిచేటపుడు, ట్రాఫిక్‌లో, మీ చుట్టూ ఉన్న వాతావర ణాన్ని చూసి ఆందోళన పడకండి. నీలివర్ణపు ఆకాశాన్ని చూడండి. గాలికి ఊగుతున్న పువ్వులను, ఆకులను గమనించండి. మీ చుట్టూ పరు చుకుని ఉన్న ఆకుపచ్చ, ఎరుపు, పసుపు? లాంటి రంగుల వస్తువు లను పరీక్షించండి. మీ చుట్టూ ఉన్న ప్రకృతిని గమనించండి. దానిని ఆస్వాదించండి. ఉదర సమస్యలు మిమ్మల్ని బాధిస్తే అపుడడగండి. రసాయన చికిత్స మీకు వైద్యులు ఇచ్చిన చీటీలోని మందులు కొనేముందు ఒక్క నిమిషం ఆగండి. ఉత్సాహంగా ఉండే వ్యాఖ్యానాలు మీ మీద మీరే ప్రయోగించుకుని చూడండి. 'ఈ రోజు చాలా మంచిరోజు 'ఈ రోజు నేను ఎంతో స్నేహంగా అందరితోనూ మెలగుతాను అందరితోనూ 'మనసువిప్పి మాట్లాడతాను, 'అవసరమైన సందర్భాల్లో జాలి, కరుణ చూపిస్తాను లాంటి ఉత్సాహపూరిత మైన మాటలు అనుకోండి. దీనివల్ల మెదడులో కొన్ని రకాల రసాయన చర్యలు జరుగుతాయి. వీటిలో ఉత్పన్నమయ్యే రసాయనాలు మందులు వాడకుండానే మీ సమస్యలను దూరం చేస్తాయి. రెండు పనులూ ఒకేసారి ఒకోసారి మీరు చేయాల్సిన పని ఎక్కువగానే ఉ ఒటుంది. అలాగే విశ్రాంతి తీసుకోవడమూ అవసరమే. మానసికంగా ప్రశాంతంగా ఉ ఒడడమే విశ్రాంతి కాబట్టి పనిచేసుకునే సమయంలోనే మంద్రస్థాయిలో మంచి సంగీతాన్ని వినండి. అలాగే రెండు మూడు పనులు ఒకేసారి కాకుండా ఒకేపని మీద మీ దృష్టి కేంద్రీ కరించండి. దీనివల్ల ఆందోళన లేకుండా, తక్కువ సమయంలో ఎక్కువ పనులు అయ్యే అవకాశం ఉంది. ఆందోళన లేదు కాబట్టి ఉదర సంబంధ సమస్యలూ ఉండవు. ్ర మీరు నిజాయితీగా శోధించుకోండి. మీరు చేస్తున్న పనిమీద మీకు ఎంత వరకు ఏకాగ్రత ఉంది. మిమ్మల్ని మీరు ఆ పనికి తగిన శక్తిసామర్థ్యాలు ఉన్న వ్యక్తిగా నమ్ముతున్నారా? ఉద్యోగంలోకానీ, ఇంట్లో కానీ మీరే కీ పర్సన్‌గా భావిస్తున్నారా? ఇలా ఆలోచిస్తున్న సమయంలో కాఫీ, టీలకు బదులు చల్లని పాలు తాగండి. మీ పిల్లలు, భర్త, బంధువులు, స్నేహితులు మిమ్మల్ని, మీరు చేసే పనిని సరిగా అర్థం చేసుకోవడంలేదని వారిపట్ల కఠినంగా ఉ ఒటున్నారా ఆలోచించండి.

## అందాల మానుషి కిల్లింగ్ లుక్

67వ మిస్ వరల్డ్ 2017 కిరీటంను దక్కించుకున్న హర్యానా బ్యూటీ మానుషి చిల్లర్ భారత్ తరపున ఈ కిరీటం దక్కించుకున్న ఆరవ యువతిగా నిలిచింది. అందంతో పాటు నాలడ్జ్ ఉన్న బ్యూటీ మానుషి చిల్లర్. నటిగా ఇండస్ట్రీలో అడుగు పెట్టిన ఈ అమ్మడు ఇప్పటికే పలు సినిమాల్లో నటించింది. సామ్రాట్ పృథ్వీరాజ్ సినిమాలో హీరోయిన్ గా నటించడం ద్వారా బాలీవుడ్ కు పరిచయం అయిన ఈ అమ్మడు ఆ తర్వాత మరికొన్ని సినిమాల్లో నటించింది. కానీ అవేవి కూడా ఈమెకు సక్సెస్ ను తెచ్చి పెట్టలేదు. ఇటీవలే ఈ అమ్మడు తెలుగు లో ఆపరేషన్ వాలంటైన్ సినిమాలో నటించింది. వరుణ్ తేజ్ నటించిన ఆ సినిమా కూడా కమర్షియల్ గా నిరాశ పరిచింది. అయితే మానుషి చిల్లర్ అందానికి ప్రతి ఒక్కరు ఫిదా అవుతున్నారు. ఆకట్టుకునే అందం ఈ అమ్మడి సొంతం అంటూ నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. తాజాగా మరో ఫోటో షూట్ తో ఈ అమ్మడు అదరగొట్టింది. యాష్ కలర్ నెట్టెడ్ డిఫరెంట్ ఔట్ ఫిట్ లో మానుషి చిల్లర్ క్లీవేజ్ షో చేస్తూ థైస్ ను ఎక్స్ పోజ్ చేస్తూ షేర్ చేసిన ఈ ఫోటో అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. ఆమె చూపుల్లో మత్తు మందు ఏదో ఉంది అన్నట్లుగా నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. ఇంతటి అందాల ముద్దుగుమ్మ కు కాలం కలిసి రాకపోవడం వల్లే ఇప్పటి వరకు సినిమాల్లో సక్సెస్ దక్కలేదు. ముందు ముందు ఈ అమ్మడు సినిమాలు మరియు వెబ్ సిరీస్ ల్లో స్టార్ గా దూసుకు పోవడం ఖాయం అంటూ సినీ విశ్లేషకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



## 'గదిలో జరగాల్సింది.. కెమెరాల ముందు చేయడం ఏంటి?: గ్రేమ్ స్మిత్

లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా తీరుపై సౌతాఫ్రికా క్రికెట్ దిగ్గజం, కామెంటేటర్ గ్రేమ్ స్మిత్ ఆగ్రహం వ్యక్తం చేశాడు. తమ జట్టు కెప్టెన్ కేఎల్ రాహుల్ పట్ల గోయెంకా వ్యవహరించిన తీరును తప్పుబట్టాడు. ఐపీఎల్ 2024 సీజన్‌లో భాగంగా సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో బుధవారం జరిగిన మ్యాచ్‌లొ 10 వికెట్ల తేడాతో లక్నో సూపర్ జెయింట్స్ చిత్తయ్యింది. ముందుగా బ్యాటింగ్‌లో తడబడిన లక్నో సూపర్ జెయింట్స్.. అనంతరం బౌలింగ్‌లో తేలిపోయింది. 166 పరుగుల లక్ష్యాన్ని సన్‌రైజర్స్ హైదరాబాద్ 9.4 ఓవర్లలోనే చేధించింది. ఆ జట్టు ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మ విధ్వంకర బ్యాటింగ్‌తో ఆకాశమే హద్దుగా చెలరేగారు. అయితే ఈ ఘోర పరాజయంతో లక్నో సూపర్ జెయింట్స్ ఓనర్ సంజీవ్ గోయెంకా తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. ఉప్పల్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌కు హాజరైన అతను.. ఈ ఓటమిని తట్టుకోలేకపోయాడు. మ్యాచ్ ముగిసిన అనంతరం కేఎల్ రాహుల్‌తో సంజీవ్ గోయెంకా సీరియస్‌గా చర్చించాడు. ఇందుకు సంబంధించిన వీడియో ఇప్పుడు సోషల్ మీడియాలో హాట్‌టాపిక్‌గా మారింది. ముఖ్యంగా ఈ ఓటమికి కెప్టెన్ కేఎల్ రాహుల్‌ను బాధ్యుడిని చేస్తూ గోయెంకా క్లాస్ పీకినట్లు ఈ వీడియోను చూస్తే అర్థమవుతోంది. మ్యాచ్ పరిస్థితిని కేఎల్ రాహుల్ వివరించే ప్రయత్నం చేసినా సంజీవ్ గోయెంకా వినిపించుకోలేదు. కోపంతో ఊగిపోయారు. వారి మధ్య జరిగిన సంభాషణపై స్పష్టత లేనప్పటికీ సోషల్ మీడియా వేదికగా భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఈ సమయంలో కామెంటేటర్‌గా ఉన్న గ్రేమ్ స్మిత్.. సంజీవ్ గోయెంకా తీరును తప్పుబట్టాడు. గదిలో చేయాల్సిన పనిని, కెమెరాల ముందు చేయడం ఏంటని ప్రశ్నించారు.ాఖీఊ లబ ఓాఉ: సంజీవ్ గోయెంకా.. సీఎస్‌కే ఓనర్స్‌ను చూసి నేర్చుకో! 'తమ జట్టు విజయం కోసం పరితపించిన ఓనర్ ఆవేదన ఇది. తమ జట్టు పేలవ ప్రదర్శనతో ఘోర పరాజయంపాలైంది. దాంతో అతనిలో భావోద్వేగాలు రేగాయి. అయితే ఇలాంటి సంభాషణలు గదిలో చేయాల్సింది. అక్కడ చుట్టూ కెమెరాలు ఉన్నాయి. వారు ఏది కూడా మిస్ చేశారు. కేఎల్ రాహుల్ మీడియా సమావేశం నిర్వహించి తమ ఓనర్‌తో ఏం మాట్లాడారో చెప్పాలి.'అని స్మిత్ చెప్పుకొచ్చాడు. ఇక సంజీవ్ గోయెంకా తీరుపై ఆర్‌సీబీ మాజీ కోచ్ మైక్ హెస్సేన్ అసహనం వ్యక్తం చేశాడు. ఏం సంభాషణ జరిగిందో అనేదానిపై క్లారిటీ లేకున్నా.. రాహుల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశాడనే విషయం అర్థమవుతుందని తెలిపాడు.




## కేఎల్ రాహుల్‌కు క్లాస్ పీకిన లక్నో జట్టు ఓనర్..

హైదరాబాద్: లక్నో సూపర్ గెయింట్స్‌తో బుధవారం జరిగిన ఐపీఎల్ మ్యాచ్‌లో హైదరాబాద్ సన్‌రైజర్స్ జట్టు చరిత్రాత్మక విజయాన్ని నమోదు చేసింది. వికెట్ నష్టపోకుండా 166 పరుగుల టార్గెట్‌ను కేవలం 9.4 ఓవర్లలోనే చేధించింది. ఎస్‌ఆర్‌హెచ్ ఓపెనర్లు ట్రావిస్ హెడ్, అభిషేక్ శర్మలు ఊచకోత కోశారు. ఆ ఇద్దరూ వీరబాదుడుకు హైదరాబాద్ ఈజీగా విజయాన్ని నమోదు చేసింది. చాలా దారుణంగా ఓటమి చెందడంతో.. లక్నో కెప్టెన్ కేఎల్ రాహుల్ నిరుత్సాహానికి గురయ్యాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత మాట్లాడుతూ తనకు మాటలు రావడం లేదని రాహుల్ పేర్కొన్నాడు. ఆ తర్వాత లక్నో ఓనర్ సంజివ్ గోయింకా కెప్టెన్ రాహుల్‌తో మాట్లాడారు. చాలా తీవ్రమైన రీతిలో రాహుల్‌తో సంజివ్ గోయింకా మాట్లాడడం కనిపించింది. దీనికి సంబంధించిన వీడియో వైరల్ అవుతోంది. సంజీవ్ గోయింకా ఆవేశంగా మాట్లాడుతుండగా.. రాహుల్ ఏదో సమాధానం ఇస్తున్నట్లు కనిపించింది.

## రామ్ ఫ్యాన్స్ కి ఆ ముచ్చట తీరనుందా...?

ఎనర్జిటిక్ స్టార్ రామ్ ప్రస్తుతం పూరి జగన్నాథ్ దర్శకత్వంలో డబుల్ ఇస్మార్ట్ సినిమాలో నటిస్తున్న విషయం తెల్సిందే. ఇస్మార్ట్ శంకర్ తర్వాత రామ్ నుంచి వచ్చిన సినిమాలు బాక్సాఫీస్ వద్ద బొక్కబోర్లా పడ్డాయి. ఇలాంటి సమయంలో పూరి జగన్నాథ్ దర్శకత్వంలో మళ్లీ సినిమా అనడంతో ఫ్యాన్స్ లో కాస్త నమ్మకం కనిపిస్తుంది. హిట్ మూవీకి సీక్వెల్ అవ్వడం వల్ల డబుల్ ఇస్మార్ట్ మూవీ ఖచ్చితంగా భారీ విజయాన్ని సొంతం చేసుకుంటుంది అనే నమ్మకం ను ప్రతి ఒక్కరు వ్యక్తం చేస్తున్నారు. ఆ విషయం పక్కన పెడితే త్వరలోనే రామ్ ను సరికొత్త ప్లాట్ ఫామ్ పై చూడబోతున్నామని ఇండస్ట్రీ వర్గాల్లో టాక్ వినిపిస్తుంది. పూర్తి వివరాల్లోకి వెళ్తే.. ప్రముఖ ఓటీటీ ప్రస్తుతం టాలీవుడ్ స్టార్ హీరోలతో వెబ్ సిరీస్ లకు ప్లాన్ చేస్తుంది. అందులో భాగంగానే రామ్ తో నెట్ ఫ్లిక్స్ ప్రతినిధులు సంప్రదింపులు జరిపారట. కథ నచ్చితే వెబ్ కంటెంట్ లో నటించేందుకు ఎలాంటి అభ్యంతరం లేదు అన్నట్లుగా రామ్ హింట్ ఇచ్చాడట. దాంతో ఇప్పటికే ఇద్దరు ముగ్గురు దర్శకులను నెట్ ఫ్లిక్స్ ప్రతినిధులు రామ్ వద్దకు కథలతో పంపించారు అంటూ సమాచారం అందుతోంది. ఆ కథల్లో ఏ ఒక్క కథ కు రామ్ ఓకే చెప్పినా కూడా త్వరలోనే రామ్ ను ఓటీటీ ప్లాట్ ఫామ్ పై వెబ్ సిరీస్ లో చూసే అవకాశం ఉందని ఫ్యాన్స్ మరియు ప్రేక్షకులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. ఈ మధ్య కాలంలో చాలా మంది హీరోలు వెబ్ కంటెంట్ లో సందడి చేశారు. కొన్నాళ్లుగా రామ్ ఫ్యాన్స్ కూడా ఆయన్ను వెబ్ సిరీస్ ల్లో లేదా ఏదైనా ఓటీటీ షో లో చూడాలని ఆశ పడుతున్నారు. ఆ ముచ్చట దీంతో తీరడం ఖాయం అంటూ ఇండస్ట్రీ వర్గాల ద్వారా సమాచారం అందుతోంది. రామ్ సినిమాల ఎంపిక నిర్ణయం లో నిర్మాత స్రవంతి రవి కిషోర్ కీలకంగా వ్యవహరిస్తారు. ఈ వెబ్ సిరీస్ నిర్మాణంలో ఆయన కూడా భాగస్వామ్యం అయ్యే అవకాశాలు లేకపోలేదు. రామ్ కెరీర్ పరంగా ఈ మధ్య కాలంలో కాస్త గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాడు. కనుక వెబ్ సిరీస్ ఎంట్రీ మంచి నిర్ణయమే అనేది కొందరి అభిప్రాయం. టాలీవుడ్ కి చెందిన వెంకటేష్, రానా, నాగ చైతన్య మరి కొందరు యంగ్‌స్టర్స్ వెబ్ సిరీస్ ల్లో నటించారు. మరి కొందరు మంచి కథల కోసం ఎదురు చూస్తున్నారు. బాలీవుడ్ లో ఇప్పటికే చాలా మంది ఓటీటీ కంటెంట్ లో నటించారు. టాలీవుడ్ లో కూడా ఆ పద్దతి కొనసాగబోతుంది.



# పెరుగుతున్న ఎండలతో తగ్గుతున్న ఆసక్తి

**ఓటేసేందుకు ముందుకు రాని జనం**

**గత మూడు పర్యాయాల్లో తగ్గిన ఓటింగ్ శాతం**

**హోరాహోరీగా ప్రచారం చేస్తున్నా కానరాని ఉత్సాహం**

న్యూఢిల్లీ,మే9(: దేశంలో అత్యంత ప్రతిష్ఠాత్మకంగా జరగబోయే ఈ ఎన్నికల్లో అధికార ఎన్‌డిఎ, కాంగ్రెస్ నేతృత్వంలోని 'ఇండియా' కూటమి హోరాహోరీగా పోరాడుతున్నాయి. గెలుపు తమదంటే తమదని రెండు వర్గాలు గట్టిగా చెబుతున్నాయి. అందుకు తగ్గట్లుగానే ఎండలను సైతం లెక్కచేయకుండా ప్రచారం జోరు సాగిస్తున్నాయి. అయితే ప్రజల్లో మాత్రం ఎన్నికల పట్ల నిరాసక్తత కనిపిస్తోంది. ఎవరికి ఓటేస్తే ఏమిటన్న భావన వస్తోంది. గత మూడు పర్యాయాలు జరిగిన పోలింగ్ సరళి చూస్తే ఓటింగ్ శాతం తగ్గిందని చెప్పవచ్చు. తగ్గిన ఓటింగ్ అంటే ఓటర్లలో ఉదాసీనత కనిపిస్తున్నదని, ఇది ప్రభుత్వ వ్యతిరేక ఓటు అని కాంగ్రెస్ చెబుతుండగా ఎండల కారణంగానే ఓటింగ్ శాతం తగ్గింది తప్ప మరొక కారణం కాదని ఎన్‌డిఎ వర్గాలు చెబుతున్నాయి. ఓటింగ్‌లో ఎందరు పాల్గొన్నా అదంతా తమకు అనుకూల ఓటని ఎన్‌డిఎ వర్గాలు చెబుతున్నాయి. 1952 నుంచి ఎన్నికల ఓట్ల శాతం, వివిధ పార్టీల గెలుపోటములను విశ్లేషిస్తే తక్కువ లేదా ఎక్కువ ఓట్లు పడితే అధికార లేదా విపక్షానికి విజయం తథ్యమనే విధంగా ఫలితాలు కనిపించడం లేదు. ఎన్నికల సెఫాలజిస్టులు మాత్రం తగ్గిన ఓటింగ్ శాతం అధికార పార్టీలకు వ్యతిరేకంగా మారే అవకాశాలే ఎక్కువని చెబుతున్నారు. దీనితో ప్రధానంగా పోటీ పడే రెండు ప్రధాన కూటముల్లో తక్కువ ఓటింగ్ భయాం దోళనలు నెలకొన్నాయి. అయినా రెండు కూటములు తమదే విజయమంటూ మేకపోతు గాంభీర్యాన్ని ప్రదర్శిస్తున్నాయి. దీనిపై వాదోపవాదాలు ఎలా వున్నా 50 డిగ్రీలకు పైగా వాతావరణం పెరిగితే ప్రజలు బయటికి వచ్చి క్యూలో నిలబడే అవకాశాలు తక్కువగా ఉంటాయి. ప్రస్తుతం ఓటింగ్ సమయం ఉదయం 7 గం. నుంచి సాయంత్రం 5 గం. దాకా ఉంది. ఉదయం 8 దాటితే ఎండలు ప్రజలను వణికిస్తున్నాయి. దీనికి తోడు వడగాడ్పులు అనేక మంది ప్రాణాలను బలి తీసుకుంటున్నాయి. మరోవైపు కరంటు కోతలు ఎన్నికల పక్రియకు ఆటంకం కల్పించే అవకాశాలు ఉన్నాయి. ఇలాంటి ప్రతికూల పరిస్థితుల్లో ఎన్నికలు జరిపి ఇప్పుడు ఓటింగ్ శాతం తగ్గిందనో, పెరిగిందనో చర్చించడం సరైనది కాదని రాజకీయ పండితులు అంటున్నారు. తెలంగాణలో ఎన్నికల సంఘం కాస్త జాగ్రత్త పడి పోలింగ్ సమయాన్ని 6 గంటల దాకా పొడిగించమని అడగడం, కేంద్ర ఎన్నికల సంఘం అంగీకరించడం జరిగింది. నిజానికి దేశవ్యాప్తంగా సాయంత్రి 7 గంటల వరకు ఓటింగ్ పొడిస్తేనే మంచిది. ఇకపోతే  ఓటింగ్ శాతం తగ్గడానికి మండే ఎండలే కారణమని ఎన్నికల సంఘం వర్గాలు కూడా చెబుతున్నాయి. మొదటి రెండు దశల ఎన్నికల్లో ఎండలు 44 డిగ్రీల ఫారెన్ హీట్‌కు పరిమితమైతే మే నెలలో ఇంకా ఎండలు విజృంభించే అవకాశముంది. వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఎండలు మే నెలలో 50 డిగ్రీలకు చేరినా ఆశ్చర్యం లేదని చెబుతున్నది. మండే ఎండలు, వీచే వడగాడ్పులు ప్రజలను ఇంటికే నిర్బంధం చేస్తున్నాయి. అలాంటి పరిస్థితిలో మునుముందు జరుగబోయే ఎన్నికల్లో ఓటింగ్ శాతం ఇంకా పడిపోయే అవకాశాలున్నాయి. ఇలాంటి పరిస్థితుల్లో తగ్గిన ఓటింగ్ శాతం ఎవరికి లాభిస్తుందనేది తీవ్ర చర్చనీయాంశ మైంది. దీనిపై గతంలో ఎన్నికల ఫలితాలు, సెఫాలజిస్టుల అంచనాలపై చర్చలు సాగుతున్నాయి. అయితే ఖచ్చితంగా ఓటింగ్ తక్కువైతే, ఎక్కువైతే అధికార పక్షానికి, విపక్షానికి లాభం జరుగుతుందనే శాస్త్రీయ అంచనాలు అయితే లేవు. ఎవరికి అనుకూలంగా వారు ఓటర్ టర్నవుట్‌ను మలుచుకుని జోస్యాలు చెబుతున్నారు.దేశంలో ఇప్పటిదాకా మూడు దఫాలుగా జరిగిన సార్వత్రిక లోక్‌సభ ఎన్నికల్లో ఓటింగ్ శాతం గతంతో పోలిస్తే తక్కువగా నమోదు కావడం రాజకీయంగా చర్చనీయాంశమైంది. 2019 ఎన్నికలతో పోలిస్తే ముగిసిన 189 లోక్‌సభ నియోజకవర్గాల్లో పోలైన ఓట్ల శాతం 3 నుంచి 4 శాతం దాకా తగ్గింది. తొలి విడతలో 101 నియోజక వర్గాలకు పోలింగ్ జరిగితే ప్రస్తుత ఎన్నికల్లో 66.14 శాతం ఓటర్లు ఓటు హక్కు వినియోగించుకున్నారని కేంద్ర ఎన్నికల సంఘం ప్రకటించింది. 2019లో ఇవే నియోజకవర్గాల్లో జరిగిన ఎన్నికల్లో 70 శాతం దాకా ఓటర్లు ఓట్లు వేశారు. రెండో దశలో కూడా ఇదే ఓటింగ్ తీరు కనిపించింది. ఇటీవల ముగిసిన రెండో దశలో 88 నియోజకవర్గాలకు ఎన్నికలు జరిగితే ప్రస్తుతం 66.71 శాతం ఓటర్లు ఓట్లు వేస్తే గడిచిన ఎన్నికల్లో ఓటర్లు ఇక్కడ 70 శాతం దాకా ఓట్లు వేశారు. మొత్తం 2019తో ప్రస్తుత పోలింగ్ శాతాన్ని పోలిస్తే 3.5 నుంచి 4 దాకా పోలింగ్ శాతం పడిపోయింది. దీనితో దేశవ్యాప్తంగా తగ్గిన ఓటింగ్ శాతం ఎవరికి మోదం, ఎవరికి ఖేదం అనే విషయమై పార్టీల్లో, పరిశీలకుల్లో భిన్న రీతుల్లో చర్చలు జరుగుతున్నాయి. ప్రస్తుతానికి రెండు దశల ఎన్నికలే ముగిశాయి. ఇంకా ఐదు దశల్లో ఎన్నికలు జరగాలి. 2019 లోక్‌సభ ఎన్నికల్లో 70 శాతం పైగా ఓట్లు పడినప్పుడు బిజెపి 302 లోక్‌సభ సీట్లతో ఘన విజయం సాధించింది. ఈ దఫా ఓటింగ్ శాతం తగ్గడంతో ఓటర్ల నిరాసక్తత నెగటివ్ ఓటును సూచిస్తుందని కాంగ్రెస్ పార్టీ వర్గాలు చెబుతుండగా, ఓటింగ్ తగ్గినా , పెరిగినా తమదే మూడోసారి విజయమని బిజెపి వర్గాలు చెబుతున్నాయి.

## ఐదు నెలల్లోనే రేవంత్ సర్కార్‌పై వ్యతిరేకత

**బిఆర్ఎస్ ఎన్నారై కో ఆర్డినేటర్ మహేశ్ బిగాల**

హైదరాబాద్,మే9: అధికారం చేపట్టిన ఐదు నెలల్లోనే రేవంత్‌రెడ్డి ప్రభుత్వంపై తెలంగాణ ప్రజల్లో తీవ్ర వ్యతిరేకత వచ్చిందని బీఆర్ఎస్ ఎన్నారై కోఆర్డినేటర్ మహేశ్ బిగాల పేర్కొన్నారు. తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ గ్లోబల్ ఎన్‌ఆర్‌ఐ విభాగం ప్రతినిధులు అనిల్‌కూర్మాచలం, తదితరులతో కలిసి గురువారం ఆయన మీడియాతో మాట్లాడారు. కేసీఆర్ చేపట్టిన బస్సుయాత్రతో కాంగ్రెస్, బీజేపీ నేతల్లో భయం మొదలై బీఆర్ఎస్ పై కొందరు పనిగట్టుకొని విషప్రచారం మొదలుపెట్టారన్నారు. ఈ క్రమంలోనే బీజేపీ ఎంపీ అభ్యర్థుల కోసం ప్రధాని మోదీ, కేంద్ర మంత్రి అమిత్‌షా ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. పార్లమెంట్ ఎన్నికల్లో క్షేత్రస్థాయి పరిస్థితులు బీఆర్ఎస్ పార్టీకి అనుకూలంగా ఉన్నాయని, తెలంగాణ ఎన్‌ఆర్‌ఐలు కేసీఆర్ వెంటే ఉన్నారని ఆయన తెలిపారు. కాంగ్రెస్ పార్టీ మైనార్టీలను ఓటు బ్యాంకుగా వాడుకొంటోందని, కేంద్రంలో వచ్చేది సంకీర్ణ ప్రభుత్వమేనని ఆయన వెల్లడించారు.



## నగరంలో మొదలైన ఇంటింటి ప్రచారం

**జాబితా ముందేసుకుని కలుస్తున్న నేతలు**

**ఓటర్ల వివరాలను రాబట్టి ఓటేయాలని దండాలు**

హైదరాబాద్,మే9: ఈనెల 13న లోక్‌సభ పోలింగ్ ఉండడంతో అన్ని పార్టీలు ఓటర్ల వేటలో పడ్డాయి. ప్రధానంగా కాంగ్రెస్, బిజెపిలు బృందాలను ఏర్పాటు చేసి వార్డుల వారీగా వివరాలు సేకరిస్తున్నారు. పోల్ చిట్టీలు అందచేస్తున్నారు. పనిలోపనిగా ఓట్లు వేయమని కోరుతున్నారు. ఓ రకంగా చెప్పాలంటే ఇంటింటి ప్రచారం మొదలయ్యిందనే చెప్పలి. ఎండకాక ముందే ఉదయమే గుంపుగా కొందరు ఇల్లకు వెళ్లి తలుపులు తడుతున్నారు. ఈ క్రమంలో ఓటరు జాబితా ప్రకారం ఇంటింటికెళ్లి వివరాలు సేకరిస్తున్నారు. జాబితా ప్రకారం చిరునామాలో ఓటర్లు ఉన్నారా.. లేరా ? అని ఆరా తీస్తున్నారు. ఒకవేళ ఇల్లు మారితే ఎక్కడుంటున్నారు ? వారి చిరునామా, ఫోన్ నంబర్లు సేకరిస్తున్నారు. గత లోక్‌సభ ఎన్నికల్లో పోలింగ్ శాతం తగ్గడంతో ఈసారి మరింత పోలింగ్ పెంచేందుకు చర్యలు తీసుకుంటున్నారు. సొంతిళ్లలో ఉన్న ఓటర్లతో ఇబ్బంది లేకున్నా తరచూ ఇళ్లు మారే వారి అడ్రస్సులు తెలుసుకోవడం కత్తిమీద సాములా మారుతోందని నాయకులు అంటున్నారు. ఓటరు జాబితా ప్రకారం ఆయా ఇంటిలో పేరు ఉండి.. ఓటరు లేకపోతే అతని కోసం వివరాలు సేకరిస్తున్నారు. ఎక్కువగా కిరాయిదారుల విషయంలో ఓటరు దొరకడం కొంత కష్టంగా మారింది. కిరాయిదారులు తరచూ ఇళ్లు మారుతుండడంలో ఓటరు జాబితా ప్రకారం సూచించిన చిరునామాలో ఉండడం లేదు. దీంతో వారి కోసం కార్యకర్తలు ఇంటి యజమానులు, చుట్టుపక్కల వారి దగ్గర సమాచారం సేకరిస్తున్నారు. వారు ఎక్కడ ఉంటే అక్కడకు వెళ్లి వారిని కలుస్తున్నారు. పోలింగ్ రోజున తప్పకుండా ఓటు హక్కు వినియోగించుకోవాలని కోరుతున్నారు. ఓటరు అన్వేషణలో బీజేపీ కొంచెం ముందుంది. గ్రేటర్‌లో నాలుగు లోక్‌సభ నియోజక వర్గాలుండగా, 24 అసెంబ్లీ స్థానాలున్నాయి. ఒక్కో అసెంబ్లీ నియోజకవర్గంలో ఉన్న పోలింగ్ బూత్‌లను విడదీసి.. ఒక్కొక్కరికీ రెండు లేదా మూడు పోలింగ్ బాధ్యతలు అప్పగిస్తున్నారు. పోలింగ్ బూత్ ఇన్ చార్జితోపాటు ఇద్దరు, ముగ్గురు కార్యకర్తలు ఇంటింటికి వెళుతున్నారు. ఓటరు జాబితా పట్టుకుని..తాము పార్టీ నుంచి వచ్చామని, వివరాలు సేకరిస్తున్నట్లు ముందుగానే ఆయా కుటుంబాలకు చెబుతున్నారు. ఓటరు, అతని కుటుంబ సభ్యులు ఉంటే జాబితాలో 'టిక్' చేసుకుంటున్నారు. లేనివారి గురించి ఆరా తీస్తున్నారు. ఆయా నియోజకవర్గాల్లో ఇంటింటికి వెళ్లి ఓటరు సమాచారం సేకరించడం వల్ల పోలింగ్ నాడు ఓటర్లను సులువుగా గుర్తించడానికి వీలుంటుందని నాయకులు అంచనా వేస్తున్నారు. ఇంటింటికి వెళ్లిన పోలింగ్ బూత్ ఇన్ చార్జి లేకపోతే, అతని వెంట వెళ్లిన కార్యకర్తలకు పోలింగ్ నాడు ఏజెంట్‌గా నియమించనున్నారు. దీంతో ఇంటింటికి వెళ్లి తయారు చేసిన జాబితాను పోలింగ్ బూత్ ఏజెంట్‌కు ఇస్తారు. ఆయా చిరునామాలో ఓటరు వివరాలపై ముందుగానే సదరు ఏజెంట్‌కు అవగాహన ఉండడం వల్ల ఒకరి ఓటును మరొకొరు వేయడానికి ఏజెంట్ నిరోధించడానికి అవకాశముందని అంటున్నారు.

# సోషల్ మీడియా ప్రచారంతో కళ్లకు గంతలు !

**అద్భుతాలు జోడించి అవాస్తవాల ప్రచారం**

**అప్పులు..నిరుద్యోగం..ధరలపై కానరాని చర్చ**

న్యూఢిల్లీ,మే9: దేశవ్యాప్తంగా ఎన్నికలు జరుగుతున్న వేళ ప్రజలు ఏ పార్టీకి ఓటేస్తారన్నది ..ఎవరిని గెలిపిస్తారన్నది జూన్ 4న ఫలితాలతో తేలనుంది. కేంద్రంలో అధికారంలో ఉన్నది బిజెపి మాత్రమే. మోడీ ప్రభుత్వం మరోమారు అధికారం కోసం గట్టి ప్రయత్నాల్లో ఉంది. ఈ క్రమంలో ప్రధాని మోడీ ఛరిష్మా.. సోషల్ మీడియా ప్రచారాలను ఉధృతం చేస్తోంది. దేశంలో మోడీని అవతారపురుషుడిగా కీర్తిస్తూ..గత పాలకులంతా పాపులుగా చిత్రీకరిస్తూ..బిజెపి సోషల్ మీడియా కోడై కూస్తోంది. సోషల్ మీడియాలో నిత్యం ప్రధాని నరేంద్ర మోడీ గురించి గొప్పలు బహుళ ప్రచారంలో ఉన్నాయి. ఆయన తుమ్మినా దగ్గినా అదో విజయంగా ప్రచారం సాగుతోంది. ఆయన అనేక విజయాలు సాధించినట్లు చెబుతున్నారు. మోడీ వచ్చిన తరవాత దేశం దశదిశ మారిందన్న ప్రచారం విపరీతంగా ఉంటోంది. అలాగే ఆయన మాత్రమే ఈ దేశాన్ని ఉద్ధరించాడన్న ప్రచారం జోరుగా సాగుతోంది. భారత్ కోసం పుట్టిన వరపుత్రుడని ప్రచారం చేస్తున్నారు. ఏ దేశం వెళ్లినా..ఏ దేశాధినేతతో మాట్లాడినా.. ఏదైనా శంకుస్థాపన చేసినా..ఏ ప్రారంభోత్సవం చేసినా ఆహా ఓహో అంటూ పుంఖానుపుఖాలుగా ప్రచారాలు వస్తున్నాయి. ప్రతి ఎన్నికల్లోనూ ఇది మరింత శృతి మించి సాగుతోంది. ఇప్పుడు సార్వత్రిక ఎన్నికల్లోనూ ఇదే ధోరణిలో ఉంటోంది.  నిజానికి కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం దేశాన్ని అప్పులకుప్పగా మార్చేసింది. గడిచిన 9 ఏండ్లలో ఏటా సగటున రూ.10 లక్షల కోట్ల అప్పులు చేసింది. ఫలితంగా 68 ఏండ్ల స్వతంత్ర భారతదేశంలో తీసుకొన్న అప్పుల కన్నా 9 ఏండ్ల మోదీ పాలనలో తీసుకొన్న అప్పులే ఎక్కువయ్యాయి.  ఎడాపెడా అప్పులు చేసిన ఘనత నరేంద్ర మోదీదేనన్న విమర్శలు వ్యక్తమవు తున్నాయి. మరోవైపు పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్‌పై పన్నులు, సెస్సుల రూపంలో ప్రజల ముక్కు పిండి వసూలు చేస్తున్నారు. ఎంతసేపు ఆదానీ అంబానీలకు దోచిపెట్టడం, వారిని మరింత సంపన్నులగా తీర్చిదిద్దే పనులు చేపట్టడం మినహా చేస్తున్న ఘనకార్యాలు ఏవీ లేవు. దేశవ్యాప్తంగా బుల్లెట్ ట్రైన్ ప్రాజెక్టు సహా 18 మెగా ప్రాజెక్టుల నిర్మాణానికి రూ.5 లక్షల కోట్ల అంచనా ఖర్చుతో పునాదిరాళ్లు తమ పేర్లతో వేసుకొన్నారు. వాటికి పెట్టుకొన్న గడువు కూడా తీరిపోయింది. ఒక్క తట్టెడు మట్టితీసిన పని కూడా జరగ లేదు. రూ.80 లక్షల కోట్ల అప్పుల సంగతి దేవుడెరుగు.. ఏటా రూ.3 లక్షల కోట్లు పెట్రో బాదుడుతోనే వసూలు చేస్తున్నారు. ఇవన్నీ ఏమయ్యాయంటే.. రాష్ట్రాలు వ్యాట్ తగ్గించాలని సుద్దులు చెబుతారు. దారుణంగా అప్పులు చేస్తున్న తీరు ఒక వైపు అయితే... జిఎస్టీ పేరుతో వసూళ్లు చేస్తున్న పన్నులు మరోవైపు గుట్టలుగా పెరుగుతున్నా సామాన్యలకు ఉపశమనం కలిగించే పని ఒక్కటంటే ఒక్కటి కూడా చేయడం లేదు. ఇలా వచ్చిన డబ్బును ఏం చేస్తున్నారని అడిగితే..గత ప్రభుత్వాలు చేసిన అప్పులను తీర్చేస్తున్నామంటూ సామాజిక మాధ్యమాల్లో పుంఖానుపుంఖాలుగా ప్రాచరం చేస్తున్నారు. అభివృద్ధికి ఖర్చు చేస్తున్నామని, మౌళిక వసతులు పెంచామని చర్చల్లో ప్రకటిస్తున్నారు. ఇకపోతే సోషల్ మీడియా ప్రచారంలో బిజెపి నేతలు ఆరితేరారు. మోదీ ప్రభుత్వం చేసిన 80 లక్షల కోట్ల అప్పుతో చేసిన ఘనకార్యా లేంటో బీజేపీ నేతలు చెప్పగలరా అంటే సమాధానం రాదు. ఇంతకీ ఏం జరిగిందో ఎక్కడా చర్చ జరగదు. బ్రహ్మాండంగా దేశాన్ని నడిపిస్తే దానినీ పార్లమెంటులో చర్చించరు. రైతుల కోసం అంటూ ప్రవేశ పెట్టిన సాగు చట్టాలపై నా చర్చించరు. రైతుల ఆదాయాన్ని రెట్టింపు చేస్తామని చెప్పి రైతలను వంచించినా చర్చించరు. జిఎస్టీ పేరుతో పన్నలు బాదుడుపైనా చర్చించడం లేదు. నిజానికి మోడీ అధికారంలోకి వచ్చాక పార్లమెంటులో చర్చ అన్నది పక్కకు పోయింది. ఏ అంశమైనా సోషల్ మీడియా ప్రచారం తప్ప చట్టసభల్లో చర్చించడం లేదు. లక్షన్నర కోట్లకు పైగా జిఎస్టీ వసూళ్లు అమోఘం అంటున్నారు. నిజానికి అంతగా ముక్కుపిండి వసూలు చేస్తున్న తీరుపై చర్చించరు. జిఎస్టీతో ప్రజలు ఏ విదంగా పీల్చిపిప్పిచేయబడుతున్నారో చెప్పడం లేదు.  చివరకు మనం పైసాపైసా కూడబెట్టుకుని చెమటోడ్చి సంపాదించిన డబ్బులతో హెల్త్ ఇన్సూరెన్స్, జీవిత బీమా చేయించుకున్నా..జిఎస్టీ పేరుతో బాదేస్తున్నారు. దీనిపై చర్చించడం లేదు. ఇకపోతే సామాన్యల సొంతింటి కల నెరవేరడం లేదు. నిర్మాణరంగం కుదేలయ్యింది. వ్యవసాయరంగం కుదేలయ్యింది. ఆర్థికరంగం అంతకుమించి కుదేలయ్యింది. అయినా అదీ చర్చించడం లేదు. ప్రచారంలో ఈ అంశాలకు చోటు లేదు.  ఉద్యోగ ఉపాధి రంగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వీటిపైనా సోషల్ మీడయాలో ప్రచారం జరగదు. ఎడాపెడా పెట్రో ధరలు పెంచుతూ పోతున్నా.. దాని వల్ల కలుగుతున్న విపరిణామాలను చర్చించరు. గ్యాస్ ధరలు సామాన్యులకు భారంగా మారినా చర్చ చేయరు. అభూత కల్పనలను జోడించి చేస్తున్న చర్చల వల్ల బిజెపిని, మోడీ అతిగా చూపిస్తూ భారత్ బ్రహ్మాండం అంటూ చూపుతున్నారు. ఇంతకన్నా దౌర్భాగ్యం మరోటి ఉండదు.  తిండిపెట్టి, దేశయువతకు ఉద్యోగ,ఉపాధి కల్పించి, రైతులకు గిట్టుబాటు ధరలు దక్కేలా వ్యవసాయాన్ని చేసే ఆలోచన ఏదీ మోడీ బృందానికి లేదు. ప్రస్తుతం పెంచిన పన్నులతో వచ్చిన డబ్బును గత పాలకులు చేసిన అప్పులు తీర్చేందుకు వాడుతున్నా మంటూ పచ్చి అబద్దాలు ప్రచారం చేస్తున్నది. ఈ నకిలీ వార్తలను దేశవ్యాప్తంగా గ్రామగ్రామానికి చేరేలా బీజేపీ ప్రచారం ముమ్మరం చేసింది. ప్రధానిగా నరేంద్రమోదీ 2014లో అధికారంలోకి రాకముందు కేంద్రం చేసిన మొత్తం అప్పు రూ.55.87 లక్షల కోట్లు.  ఈ లెక్కన ప్రతి నెల మోదీ ప్రభుత్వం తీసుకొన్న సగటు రుణం రూ.83,341 కోట్లు. 2014లో కేంద్రానికి వచ్చిన ఆదాయంలో పెట్రోల్, డీజిల్‌పై వచ్చిన పన్నుల వాటా 5.4 శాతంగా ఉండగా, 2020-21 నాటికి అది 12.2 శాతానికి పెరిగింది. నేడు ఒక్క వంటగ్యాస్ సిలిండర్‌కు పెడుతున్న ఖర్చుతో మోదీ మొదటిసారి ప్రధాని అయినప్పుడు రెండు సిలిండర్లు వచ్చేవి. చమురు ధరల పెంపుతో కేంద్రం ఏటా రూ.3 లక్షల కోట్లను ప్రజల ముక్కుపిండి వసూలు చేస్తున్నారు. ప్రజల్లో వ్యతిరేకత  పెరుగుతున్నా..పట్టించుకోద్దన్న సూత్రాన్ని అవలంబిస్తున్నారు. ఎదురుదాడి చేస్తున్నారు. రాష్ట్రాల్లో అభివృద్ధి అంతా తమ చలువేనని చాటుకుంటున్నారు. సిగ్గూఎగ్గూ లేకుండా ప్రజలను జలగల్లా పీల్చి పిప్పి చేస్తున్నారు. దీనికి చరమగీతం పాడకుంటే నష్టపోయేది ప్రజలే. ప్రజలు దీనిని నిరసించాలి. ఎక్కడిక్కడ నిలదీయాలి. సోషల్ మీడియా విష ప్రచారాలను పసిగట్టాలి. ఎక్కడికక్కడే ఎదురుదాడి ప్రారంభించాలి. తిప్పికొట్టాలి. అప్పుడే ప్రజలు విజయం సాధిస్తారు.

## నిస్వార్థ సమర యోధుడు..గోపాలకృష్ణ గోఖలే !

న్యూఢిల్లీ,మే9(:దేశం కోసం ప్రాణాల్ని సైతం లెక్క చేయకుండా ఉద్యమాలకి ఊపిరి పోసిన ఎందరో సమరయోధుల్లో గోపాల కృష్ణ గోఖలే ఒకరు. నేటి తరంలో చాలామంది ఈ పేరు కూడా విని ఉండరు. కానీ, ఆయన నాయకత్వ పటిమ గురించి ఒక్కసారి చదివితే ఖచ్చితంగా మర్చిపోరు. జాతిపితగా నేటికీ అందరి మన్ననలు పొందుతున్న మహాత్మ గాంధీజీ గోఖలేని తన గురువుగా అభివర్ణించారంటే గోఖలే వ్యక్తిత్వం ఎంత గొప్పదో అర్థం చేసుకోవచ్చు.. మే9 మహానుభావుడి జన్మదినం సందర్భంగా ఆయన గురించి చరిత్ర చెప్పిన కొన్ని నిజాలు తెలుసుకుందాం..1866 మే 9వ తేదీన ఓ సాధారణ బ్రాహ్మణుల కుటుంబంలో జన్మించారు గోఖలే. ఆయన స్వగ్రామం మహారాష్ట్రలోని రత్నగిరి జిల్లా గుహాగర్ తాలూకా కొట్లాక్ గ్రామం. ఆస్థిపాస్తులు పెద్దగా లేకపోయినా అప్పట్లోనే గోఖలేకి ఆంగ్ల విద్యని చెప్పించారు ఆయన తల్లితండ్రులు. దేశంలో మొట్టమొదట ఆంగ్ల విద్యని అభ్యసించిన భారతీయుల్లో గోఖలే ఒకరు. ఆయన చదువుల్లో రాణించి ఆంగ్ల భాషపై పట్టు సంపాదించడంతో బ్రిటిష్ ప్రభుత్వ ఉద్యోగిగా నియమితు డయ్యాడు. నేర్చుకున్న విద్య ఆయన ఆలోచనల్లో కొత్త ఒరవడిని తీసుకొచ్చింది. రాజకీయాలలో పాల్గొనటానికి నమ్మకస్తుడైన వ్యక్తి కోసం ఎదురు చూస్తున్న జస్టిస్ మహాదేవ్ రానడేకి గోఖలే పరిచయమయ్యాడు. గోఖలేకి రాజకీయాల పట్ల ఉన్న ఆసక్తి, పట్టుదల గమనించిన రానడే గోఖలేని శిష్యుడిగా చేసుకున్నాడు.రానడే స్థాపించిన 'పూనా సార్వజనిక్' సభ నిర్వహించే పత్రికా సంపాదకుడిగా గోఖలేకి బాధ్యతలు అప్పగించి చిన్న వయసులోనే రాజకీయ జీవితానికి నాంది పలికారు.

# మార్పు దిశగా దేశ రాజకీయాలు

**మోడీ నిరంకుశత్వంపై తిరుగుబాటు**

**లౌకికి శక్తులకు దక్కనున్న రాజ్యాధికారం**

**రాజ్యాంగం రద్దు చేసే ప్రయత్నాలు**


**తాజా ఎన్నికల పరిస్థితులపై మీడియాతో ఏచూరి**

విజయవాడ,మే9: దేశంలో ప్రస్తుతం జరుగుతున్న సార్వత్రిక ఎన్నికలు  చాలా కీలకంగా ఉన్నాయని సీపీఎం జాతీయ కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. తప్పకుండా ఈసారి దేశంలో మార్పు ఖాయం.. ప్రభుత్వం మారడం తథ్యమని స్పష్టం చేశారు. గురువారం మీడియాతో మాట్లాడుతూ..వికసిత్ భారత్ అంటే ప్రజల జీవనం వికసించాలన్నారు. కానీ అదానీ, అంబానీలు వికసిస్తే.. దేశం వృద్ధి చెందినట్లు కాదని సెటైర్ వేశారు. ఇండియా కూటమి విజయంలో తమ వంతు పాత్ర పోషిస్తామన్నారు. లౌకిక శక్తులన్నీ కలిసి కొత్త ప్రభుత్వాన్ని ఏర్పాటు చేస్తామనే నమ్మకం ఉందన్నారు. రాజ్యంగం, ప్రజాస్వామ్యం, పౌర హక్కులు కాపాడేందుకు లౌకకి ప్రభుత్వం ఎంతో అవసరం అని చెప్పుకొచ్చారు. దేశంలో అనేక ప్రాంతాలు పరిశీలించాక.. ప్రజల్లో ఈ మార్పు వచ్చిందని గుర్తించినట్లు తెలిపారు. ప్రజాస్వామ్యం ఉంటుందా?.. లేదా?, వచ్చే పరిణామాలు తట్టుకుంటాయా?.. లేదా? అనేది ఈ ఎన్నికలు నిర్ణయిస్తాయన్నారు. రాజ్యాంగాన్ని రద్దు చేసే ప్రయత్నం దేశంలో జరుగుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశంలో జరుగుతున్న అనేక దారుణాలపై కేంద్ర ఎన్నికల సంఘానికి ఫిర్యాదులు ఇచ్చామన్నారు. వాటిపై కనీసం ఎక్‌నాలెడ్జ్‌మెంట్ కూడా ఇవ్వని పరిస్థితి ఇప్పుడు చూస్తున్నామన్నారు. సీబీఐ, ఈడీ నేడు కేవలం రాజకీయ కోణంలోనే పని చేస్తున్నాయని విమర్శించారు. స్వాతంత్య్రం తరువాత ఇంత నిరుద్యోగం ఎప్పుడూ దేశంలో చూడలేదన్నారు. నేడు ప్రతి కుటుంబం అప్పులు చేసి పోషించుకోవాల్సిన దుస్థితి కల్పించార న్నారు. పేదలు మరింత పేదలుగా మారిపోతుండగా, ధనికులు మరింత ధనవంతులుగా పెరుగుతున్నారని అన్నారు. ఉద్యోగం, ఉపాధి అవకాశాలు లేక బతుకు తెరువు భారం బాగా పడుతుందన్నారు. ఇదంతా మోదీ నియంతృత్వ విధానాలే కారణమని సీపీఎం అభిప్రాయ పడుతుందన్నారు. ఎన్నికల ప్రచారంలో ఈ అంశాలపై మోదీవైపు నుంచి స్పందనే లేదని మండిపడ్డారు. రెండు తెలుగు రాష్ట్రాల్లో జరిగిన సభల్లో కూడా మోదీ ప్రస్తావించలేదన్నారు. వినాశకాలే విపరీత బుద్దులు అనే సామెత మోదీ విషయంలో అర్థం అవుతోందన్నారు. మోదీ ప్రధాని అయ్యే వరకు అదానీ అనే వ్యక్తి ఎవరో ఎవరికైనా తెలుసా అని ప్రశ్నించారు. ఇప్పుడు ఎయిర్ పోర్టులు, సీ పోర్టులు, పెట్రో కెమికల్ ఇండస్ట్రీ, ఇన్మర్మేష్ టెక్నాలజీ అన్నీ అదానీ, అంబానీ పరమేనా అని నిలదీశారు. టెంపోలో క్యాష్ ఇస్తున్నారంటే బ్లాక్ మనీ ఉందనేది అర్థం అయిపోతుందన్నారు. అదానీకి, అంబానీ సంస్థలపై ఈడీ, సీబీఐ ఎందుకు దృష్టి పెట్టడం లేదని నిలదీశారు. పోలరైజేషన్‌ను మరింత విస్తృతం చేసి, మతోన్మాదాన్ని రెచ్చగొట్టే ప్రసంగాలు చేస్తున్నారని సీపీఎం నేత ఆగ్రహం వ్యక్తం చేశారు. మొదటి రెండు దఫాలు ఎన్నికలు పూర్తి అయిన తర్వాత మోదీకి ఓటమి తప్పదని తేలిపోయిందన్నారు. అందుకే ఇప్పుడు హిందూత్వం పేరుతో రామ మందిరాన్ని ప్రచారం చేస్తున్నారని అన్నారు. ఎన్నికల సంఘానికి ఎన్ని ఫిర్యాదులు చేసినా వారు పరిగణలోకి తీసుకోవడం లేదని అన్నారు. ఈ ఎన్నికల తర్వాత దేశ రాజకీయాల్లో తప్పకుండా పెద్ద మార్పు వస్తుందని ధీమా వ్యక్తం చేశారు. ఎన్డీఏ కూటమి పేరుతో పొత్తులతో మోదీ వెళుతున్నారని.. ఇండియా కూటమితో తాము వెళు తున్నామన్నారు. ఈ ఎన్నికలలో ప్రధాన అంశాలు, సమస్యలను మోదీ ప్రస్తావించడం లేదన్నారు. ప్రజల్లో ఉన్న భావాలను రాజకీయంగా మార్చుకుని మతోన్మాదం కోసం మోదీ ప్రచారం చేస్తున్నారని ఆరోపించారు. ఏపీలో తెలుగుదేశం, రీజనల్ పార్టీలకు బీజేపీ పొత్తు వల్ల వారికే నష్టమన్నారు. ఏపీలో 10 అసెంబ్లీ, 6 పార్లమెంట్ స్థానాల్లో బీజేపీ పోటీ చేస్తుందని.. అంటే ఏపీలో బీజేపీకి ప్రాధాన్యత లేదని అందరికీ అర్థమవుతోందన్నారు. మోదీ ఓటమి భయంతో ఇలా ప్రతి రాష్ట్రంలో తగ్గి మరీ.. రీజనల్ పార్టీలకు మద్దతు ఇస్తున్నారన్నారు. మోదీ మతోన్మాద రాజకీయాలు అర్థం కావడం వల్లే ప్రజలు వారిని తీవ్రంగా వ్యతిరేకిస్తున్నారన్నారు.

## అమెరికాలో మరో భారత విద్యార్థి అదృశ్యం

**తెలంగాణకు చెందిన రూపేశ్ చంద్ర కోసం గాలింపు**

న్యూయార్క్,మే9(: అమెరికాలో మరో భారతీయ విద్యార్థి కనిపించకుండా పోయాడు. తెలంగాణకు చెందిన రూపేశ్ చంద్ర చింతకింది షికాగోలో అదృశ్యమయ్యాడు. గత వారం రోజులుగా అతని ఆచూకీ లేదని భారత రాయబార కార్యాలయం వెల్లడించింది. రూపేశ్ ప్రస్తుతం షికాగోలోని విస్కాన్సిన్‌లో ఉన్న కాంకార్డియా యూనివర్సిటీలో మాస్టర్స్ చదువుతున్నాడు. భారత్‌కు చెందిన రూపేశ్ మే 2వ తేదీ నుంచి కన్పించడంలేదని తెలిసి కాన్సులేట్ ఆందోళన చెందుతున్నది. అతడి ఆచూకీ కోసం పోలీసులు, ప్రవాస భారతీయులతో నిరంతరం సంప్రదింపులు జరుపుతున్నాం. త్వరలోనే అతని జాడ తెలుస్తుందని ఆశిస్తున్నామని షికాగోలోని భారత రాయబార కార్యాలయం సోషల్ మీడియా వేదికగా తెలిపింది. కాగా, రూపేశ్ గురించి తెలిస్తే తమకు సమాచార అందించాలంటూ పోలీసులు స్థానికులను కోరారు. ఉన్నత విద్యకోసం వెళ్లిన తమ కుమారుడి జాడ తెలియకపోవడంతో అతని తల్లిదండ్రులు ఆందోళనకు గురవతున్నారు. రూపేశ్ ఆచూకీ కనుక్కోవాలంటూ భారత విదేశాంగ మత్రిత్వ శాఖను, అమెరికా ఎంబసీని అభ్యర్థించారు. కాగా, ఈ ఏడాది ఆరంభం నుంచి అమెరికాలో వరుసగా ఇలాంటి ఘటనలు చోటు చేసకుంటున్న విషయం తెలిసిందే. దాడులు, కిడ్నాప్‌ల వంటి ఘటనల్లో ఇప్పటికే పలువురు భారతీయ, భారత సంతతి విద్యార్థులు ప్రాణాలు కోల్పోయారు.



EDITED, PRINTED, PUBLISHED AND OWNED BY PERUMALLA CHENNAKESHAVULU PRINTED AT UTTEJETHA PRINTERS,H: NO: 46/801BHUDHAWARPETA, KURNOOL DIST,-518001, ANDHRA PRADESH, INDIA . PUBLISHED AT. H.NO 43/217A, NR PETA, KURNOOL DIST, ANDHRA PRADESH, INDIA. EDITOR PERUMALLA CHENNAKESHAVULU RNI NO: APTEL 2020/80757